# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 133 ఆదివారం 09 జులై 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-




## అనర్హత పిటీషన్ పై నోటీసులు

**ముంబై, జూలై 8:**

మహారాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. అజిత్ పవార్ ఎన్‌సిపి ఎమ్మెల్యేలతో పాటు షిండే ప్రభుత్వంలో చేరిన తర్వాత, ఇప్పుడు మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ 54 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సమాధానాలు కోరారు. ఈ మేరకు మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ శనివారం సమాచారం అందించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు చెందిన 40 మంది ఎమ్మెల్యేలు, ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన 14 మంది ఎమ్మెల్యేలు తమపై దాఖలైన అనర్హత పిటిషన్‌పై స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నుంచి తనకు శివసేన రాజ్యాంగం కాపీ అందిందని, ముఖ్యమంత్రి షిండేతో సహా 16 మంది శివసేన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లపై విచారణ త్వరలో ప్రారంభమవుతుందని అసెంబ్లీ స్పీకర్ నర్వేకర్ ఒకరోజు ముందుగానే

02

# దేశాభివృద్ధిలో తెలంగాణ కీలకం

### ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

**వరంగల్, జూలై 8:**

తెలంగాణ ప్రజల బలమే భారతదేశ బలాన్ని పెంచుతుందని ప్రధాని మోడీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. అనంతరం హిందీలో ప్రసంగాన్ని కొనసాగించారు. తెలంగాణలో రూ. 6,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ ఈరోజు శంకుస్థాపన చేశారు. అందులో రూ. 521 కోట్లు కాజీపేటలో నిర్మించనున్న వ్యాగన్ తయారీ పరిశ్రమకు రూ. 3,441 కోట్లు ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా వరంగల్–మంచిర్యాల జాతీయ రహదారి విస్తరణకు రూ. 2,147 కోట్లతో జగిత్యాల–కరీంనగర్–వరంగల్ ఇంటర్ కారిడార్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏర్పడి 9 ఏళ్లు అవుతుందని గుర్తు చేశారు. దేశాభివృద్ధిలో తెలంగాణ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దేశ అభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకమైనది అంటూ కితాబు ఇచ్చారు. హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన వివిధ అభివృద్ధి పనులను శంకుస్థాపన కార్యక్రమంలో ప్రధానమంత్రి మోదీతోపాటు కేంద్రమంత్రులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. దేశాభివృద్ధిలో తెలుగువారి ప్రతిభ కీలకంగా మారిందన్నారు ప్రధానమంత్రి. ఇది దేశానికి స్వర్ణయుగమని అభివర్ణించారు. ఆరు వేలకోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించుకుంటున్నామని అన్నారు. దేశాభివృద్ధి కోసం శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నామని



02

## ఒడిశా రైలు ప్రమాదంపై సీబీఐ దర్యాప్తులో కీలక పరిణామం

### ముగ్గురు ఇండియన్ రైల్వే ఉద్యోగులను అరెస్ట్

**న్యూఢిల్లీ జూలై 8**

ఏకంగా 293 మంది ప్రాణాలను బలిగొన్న ఒడిశా రైలు ప్రమాదంపై సీబీఐ దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో కుట్రకోణంపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ ప్రమాదంతో సంబంధమున్న ముగ్గురు ఇండియన్ రైల్వే ఉద్యోగులను అరెస్ట్ చేసింది. సీనియర్ సెక్షన్




ఇంజనీర్(సిగ్నల్) అరుణ్ కుమార్ మెహతా, సెక్షన్ ఇంజనీర్ మహ్మద్ అమీర్

02

## భారత్‌ని భయపెడుతున్న ఎల్‌నినో

**ముంబై, జూలై 8:**

పసిఫిక్ మహా సముద్రంలో ఎల్‌నినో ఎఫెక్ట్ మొదలైనట్టు ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించింది. ఏడేళ్ల తరవాత ఈ స్థాయిలో ప్రభావం కనిపించడం ఇదే తొలిసారి. ఈ ఎఫెక్ట్‌తో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఉష్ణోగ్రతలు అధికమయ్యే ప్రమాదముంది. ఈ ఏడాదిలో వచ్చే ఆర్నెల్ల పాటు ఈ ఇంపాక్ట్ కొనసాగుతుందని చిటా స్పష్టం చేసింది. ఈ నోటిఫికేషన్‌తో అంతర్జాతీయంగా ఉన్న వాతావరణ నిపుణులు అలెర్ట్ అయ్యారు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని హెచ్చరించారు. చిటా



ఇచ్చిన హెచ్చరికల ఆధారంగా అన్ని దేశాలూ అప్రమత్తం అవ్వాలని, వాతావరణ మార్పులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్యంపై ప్రభావం చూపించకుండా ముందస్తు

02

## దుక్కి దున్ని వరి నాట్లు వేసి...



**సోనిపట్**

హర్యానా పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ రైతులతో కలిసి వ్యవసాయ పనులు చేశారు. ట్రాక్టర్తో దుక్కి దున్ని వరి నాటేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రైతుగా మారారు. శనివారం ఉదయం హర్యానాలోని సోనిపట్లో ఆకస్మికంగా పర్యటించిన ఆయన పొలంలోకి దిగి ట్రాక్టర్తో దుక్కి దున్నారు. నాట్లేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను

02

# రైతు రాజ్యం... మోసం చేసే రాజ్యమా..

**అనంతపురం, జూలై 8 :**

దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుల ఖాతాల్లో పంట బీమా పరిహారం జమ చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైఎస్సార్ రైతు దినోత్సవంలో పాల్గొన్నారు. 2022–ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు లబ్ధి కలిగిస్తూ బీమా పరిహారం విడుదల చేశారు. ఈ సందర్భంగా బహిరంగసభలో సీఎం మాట్లాడారు. బీమా పరిహారం రూ.1,117 కోట్లు పంపిణీకి శ్రీకారం చుట్టామని, దీంతో రాష్ట్రవ్యాప్తంగా 10.2 లక్షల మంది రైతులకులబ్ధి చేకూరనుందని తెలిపారు. ఐదేళ్లలో చంద్రబాబు బీమా పరిహారంగా రైతులకు చెల్లించింది కేవలం రూ.3,411 కోట్లు మాత్రమేనని జగన్ తెలిపారు. మేము అధికారంలోకి వచ్చాక రైతులకు చెల్లించింది రూ. 7,802 కోట్లు అన్నారు.



ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలగకుండా ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టామన్నారు. ప్రతి ఏటా మూడు విడతల్లో వైఎస్సార్ రైతు భరోసా అందిస్తున్నాం. నాలుగేళ్లలో కోటిన్నర రైతులకు రూ.30 వేల 985 కోట్లు రైతు భరోసా ఇచ్చామన్నారు. గ్రామస్థాయిలోనే ఆర్బీకేలు తీసుకొచ్చి రైతులకు సేవలు అందిస్తున్నామని జగన్ గుర్తు చేశారు. ఐదేళ్లలో చంద్రబాబు.. రైతులకు అరకొరగా బీమా డబ్బులు చెల్లించారు. చంద్రబాబు గజ దొంగల ముఠా మొసలి కన్నీరు కారుస్తోందని మడిపడ్డారు. కరువు వచ్చినా చంద్రబాబు ప్రభుత్వంలో పరిహారం ఇవ్వలేదని ఆరోపించారు. విత్తనం మొదలు పంట అమ్మకం? వరుకు ఆర్బీకే రూపంలో రైతుకు తోడుగా ఉంటున్నామని సీఎం

03



## ఏసీ రైళ్లలో ప్రయాణ ఛార్జీల్లో డిస్కౌంట్ స్కీమ్

**న్యూఢిల్లీ జూలై 8**

రైల్వే ప్రయాణికులకు రైల్వే మంత్రిత్వ శాఖ శుభవార్త చెప్పింది. సీటింగ్ అకామడేషన్ ఉన్న ఏసీ రైళ్లలో ప్రయాణ ఛార్జీల్లో డిస్కౌంట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టాలని రైల్వే జోన్లను ఆదేశించింది. గడచిన 30 రోజుల్లో 50 శాతం కన్నా తక్కువ ఆక్యుపెన్సీ ఉన్న ఈ రైళ్లలో ఈ ఆఫర్‌ను ప్రకటించాలని తెలిపింది. రైళ్లలో వసతులు సాధ్యమైనంత ఎక్కువగా వినియోగ మయ్యే విధంగా

02

# నీలకురింజి సముద్రం పుస్తకావిష్కరణ

**ప్రజా తపన ,అనంతపురం**

అనంతపురం ఆర్ట్స్ కళాశాల యందు సాహితీ స్రవంతి మరియు ఆంధ్రభారతి (తెలుగు శాఖ) ప్రభుత్వ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి / కవయిత్రి గారైన డాక్టర్. యం . ప్రగతి గారి "నీలకురింజి సముద్రం"అనే ప్రగతి కవిత్వం ఆవిష్కరణ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా టి .రాజారాం గారు మాట్లాడుతూ 'సమాజ ప్రగతి రథచోదకులు కవులని, ప్రగతి గారు విద్యార్థుల మధ్య ఉంటూనే సమాజాన్ని దర్శించి ప్రేమ కవిత్వాన్ని అందించారని అన్నారు. విశిష్ట ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సి ఆర్ దివాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈనాటి ఒత్తిడి మయమైన ఉద్యోగ జీవితంలో వృత్తి ప్రవృత్తిని చక్కగా సమన్వయించుకొని సాహిత్య సృజన చేసినందుకు" ప్రగతి "గారిని అభినందించారు.

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు అయిన కెంగార మోహన్ గారు "నీలకురింజి సముద్రం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవిత్వాన్ని బాగా అధ్యయనం చేస్తేనే గాని నాణ్యమైన కవిత్వం రాదని తెలుపుతూ సమాజానికి జబ్బు చేస్తే చికిత్స చేయాల్సిన వైద్యులు కవులని వారు అందించే సాహిత్యం ఎప్పుడూ సమాజంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని, సాహిత్యకారులు పీడితపక్షమని వివరించారు. ఈ సభ కు ముఖ్య అతిథిగా విచ్చేసిన పాణి (విరసం రాక్షస అధ్యక్షులు) గారు మాట్లాడుతూ కళ్ళ ముందున్న జీవన సత్యాన్ని తెలియజేసేది సాహిత్యమని అది తీవ్రమైన పని ఒత్తిడిలో, సంక్షోభంలో ,రాజకీయ అభినివేశంలో కవిత్వం పుడుతుందని అన్నారు.

ఈనాటి సభకు సందేశ కారులుగా విచ్చేసిన డాక్టర్ రాధేయ గారు మాట్లాడుతూ "అమ్మ జ్ఞాపకం



వస్తే వెచ్చని బొగ్గుపొయ్యి లా హృదయానికి తాకుతుందని తెలుపుతూ మరెన్నో చక్కని భావ ప్రతీకలు అందించిన డాక్టర్ ఎం ప్రగతి గారిని అభినందించారు. తర్వాత అరుణాంక్ లత (ఛాయా రిసోర్స్ సెంటర్, హైదరాబాద్) గారు మాట్లాడుతూ ఈ పుస్తకంలో వస్తువు వ్యక్తిగతమైనది కాదని సామాజికమైనదని వివరించారు. ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖ అధిపతి డాక్టర్ బి హేమమాలిని గారు మాట్లాడుతూ సాహిత్య కళను - శాస్త్రాన్ని చక్కగా మేళవించి మంచి సాహిత్యాన్ని అందించారని అభినందించారు. మరొక అతిథి ఏ హరి సాహితీ స్రవంతి కన్వీనర్ సత్యసాయి జిల్లా గారు మాట్లాడుతూ ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తూనే చక్కని కవిత్వాన్ని సృజించారని అభినందించారు.

పుస్తక సమీక్షలో భాగంగా ప్రముఖ కవయిత్రి ఆర్ శశికళ గారు మాట్లాడుతూ " Beautiful minds are create beautiful poetry'అన్నట్టు ప్రగతి గారి కవిత్వం ఉందని ఆమె కవిత్వం "ప్రేమతో కూడిన రసాయనిక చర్య"అని సమీక్షించారు. మరొక సమీక్షకురాలు జి పేరింది గారు మాట్లాడుతూ ఈ పుస్తకంలో స్త్రీ ప్రాధాన్యం కలిగిన కవితలు ఎక్కువగా ఉన్నాయని, జీవితాన్ని ఉన్నతీకరించడమే కవిత్వమని ,మనోళ్లేనా ...అనే కవితను ఉటంకిస్తూ ప్రగతి గారు కరోలస్ లిన్నేయస్ ద్వినామీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారని తెలుపుతూ, అనేక కవితల్ని వివరించారు. చివరిగా పుస్తక కవయిత్రి స్పందన లో భాగంగా డాక్టర్ ఎం ప్రగతి గారు ఈ నీల కురింజి సముద్రం పుస్తకం యొక్క పేరులోని అంతరార్థాన్ని వివరించి, ఈ పుస్తక రచనలో సహకరించిన వారందరికీ ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. ఆ తరువాత ఈ కార్యక్రమానికి వందన సమర్పణ అంకె శ్రీనివాస్ గారు తెలిపారు.

ఈ కార్యక్రమానికి అనేకమంది సాహితీ ప్రియులు పుర ప్రముఖులు హాజరయ్యారు. వీరితో పాటుగా కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులతో పాటు, తెలుగు విభాగ అధ్యాపకులైన కే.లక్ష్మీనారాయణ, జి.మాధవి లత, జె.యోగేశ్వర నాయుడు, అంకే మదన మోహన గారితో పాటు తెలుగు సాహిత్యాన్ని ప్రధాన సబ్జెక్టు ఎంచుకున్న డిగ్రీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు..

# అనర్హత పిటీషన్ పై నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు.నార్వేకర్ మీడియాతో మాట్లాడుతూ, "ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి చెందిన 40 మంది ఎమ్మెల్యేలు, ఉద్ధవ్ ఠాక్రే శిబిరానికి చెందిన 14 మంది ఎమ్మెల్యేలకు అనర్హతపై సమాధానాలు కోరుతూ నోటీసులు జారీ చేయబడ్డాయి." ఈ వారం మొదట్లో శివసేన పార్టీ అధినేత సుప్రీంకోర్టును ఆశ్రయించి, అనర్హత పిటిషన్లను వెంటనే విచారించేలా శాసనసభ స్పీకర్‌ను ఆదేశించాలని అభ్యర్థించారు. అవిభక్త శివసేన చీఫ్ విప్‌గా ఉన్న ఎమ్మెల్యే సునీల్ ప్రభు.. గత ఏడాది షిండే వర్గం తిరుగుబాటు చేసి.. జూన్ 2022లో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పుడు షిండేతో పాటు మరో 15 మంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ వేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే కొనసాగుతారని గత నెల 11న సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొంది. షిండే తిరుగుబాటు నేపథ్యంలో బలపరీక్షను ఎదుర్కోకుండానే శివసేన అధినేత రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నందున ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) ప్రభుత్వాన్ని పునరుద్ధరించలేమని కోర్టు పేర్కొంది.

# ఒడిశా రైలు ప్రమాదంపై సీబీఐ దర్యాప్తులో కీలక పరిణామం

(మొదటిపేజీ తరువాయి)

ఖాన్, టెక్నీషియన్ పప్పు కుమార్‌లను అదుపులోకి తీసుకుంది. హత్యకు సమానం కాని శిక్షించదగిన నేరం, ఆధారాల చెరిపివేత కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొంది. వీరి ముగ్గురి చర్యలే ప్రమాదానికి దారితీశాయని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఉద్దేశ్యపూర్వకం కాకపోయినప్పటికీ వారి చర్యలు విషాదానికి దారితీస్తాయని వారికి తెలుసని తెలిపాయి. కాగా ఉద్దేశ్యపూర్వకంగా చేసి ఉంటే హత్యానేరం కింద కేసు పెట్టి ఉండేవారు.కాగా రైల్వేస్ సేఫ్టీ కమిషనర్ గతవారమే కీలక ప్రకటన చేశారు. మానవ తప్పిదమే ప్రమాదానికి కారణమని తేల్చేశారు. సిగ్నలింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే వర్కర్లే ఇందుకు కారణమని చెప్పిన విషయం తెలిసిందే.

# భారత్‌ని భయపెడుతున్న ఎల్‌నినో

(మొదటిపేజీ తరువాయి)

జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సాధారణంగా ప్రతి 2-7 ఏళ్లకు ఎల్‌నినో ప్రభావం కనిపిస్తూ ఉంటుంది. దాదాపు 9-12 నెలల పాటు ఆ ప్రభావం కొనసాగుతుంది. వాతావరణ మార్పుల కారణంగా ఇదంతా సహజమే అయినా...ఈ సారి ఈ ప్రభావం మరీ తీవ్రంగా ఉండనుంది. వచ్చే ఐదేళ్లలో చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని చిటూ అంచనా వేసింది. 2016లో ఎల్ నినో చూపించిన ప్రభావం కన్నా ఇది ఎక్కువగా ఉంటుందని తెలిపింది. 2023-27 మధ్య కాలంలో ప్రస్తుతం ఉన్న ఉష్ణోగ్రతల కన్నా కనీసం 1.5 డిగ్రీల మేర అధికంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఆ తరవాత కూడా ఇవే టెంపరేచర్స్ కొనసాగుతుండొచ్చని చిటూ సైంటిస్ట్‌లు చెబుతున్నారు. చిటూ లెక్కల ప్రకారం...2016లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సౌత్ అమెరికా, సౌతర్న్ యూఎస్, మధ్య ఆసియా ప్రాంతాల్లో ఎన్ నినో ప్రభావం కనిపించనుంది. ఆస్ట్రేలియా, ఇండోనేషియాతో పాటు దక్షిణాసియా, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా ప్రాంతాల్లో కరవు సంభవించే ప్రమాదముంది. ఇండియాపై కూడా దీని ఇంపాక్ట్ గట్టిగానే ఉండేలా ఉంది. ఇప్పటికే నైరుతి రుతు పవనాలు ఆలస్యం కాగా...ఎల్‌నినో కారణంగా వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు. కరవు సంభవించే దేశాల లిస్ట్‌లో భారత్ కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు ఓ కారణముంది. ఎల్‌నినో ప్రభావం వల్ల సముద్రాలు వేడెక్కుతాయి. ఫలితంగా...నైరుతి రుతు పవనాల కదలిక కాస్త తగ్గిపోతుంది. అది నేరుగా వర్షపాతంపై ప్రభావం చూపిస్తుంది. వర్షాలు సరిగ్గా కురవక పంటల దిగుబడి తగ్గిపోతుంది. ఇటీవల భారీ వర్షాలు కురిసి కూరగాయల సాగు తీవ్రంగా దెబ్బతింది. ధరలు ఆకాశాన్నంటాయి. ఇక రానున్న రోజుల్లో కరవు వచ్చినా...ఇదే పరిస్థితి తలెత్తుతుంది. మరి కొన్ని రోజుల పాటు కూరగాయల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2001-20 మధ్య కాలంలో దాదాపు నాలుగు సార్లు ఎల్‌నినో కారణంగా కరవు సంభవించింది. ఆయా సంవత్సరాల్లో పంట దిగుబడి తగ్గిపోయింది. ద్రవ్యోల్బణం పెరిగింది. మళ్లీ అలాంటి పరిస్థితులే తలెత్తే ప్రమాదముందని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిస్తోంది. దీన్ని ఎదుర్కొనేందుకు అన్ని దేశాలూ సిద్ధంగా ఉండాలని సూచించింది.

# దేశాభివృద్ధిలో తెలంగాణ కీలకం

(మొదటిపేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. అనేక ఆర్థిక కారిడార్లను పూర్తి చేసుకుంటున్నాం. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఇండస్ట్రీయల్ ఎకనామిక్ కారిడార్లు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో ముక్య చారిత్రక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రాలున్నాయని గుర్తు చేశారు. కరీంనగర్ గ్రానైట్ పరిశ్రమకు కేంద్రం సహకారం అందిస్తోందని తెలిపారు.అంతకు ముందు మాట్లాడిన నితిన్ గడ్కరీ.. 9 ఏళ్లలో మౌలిక సదుపాయ కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. గతిశక్తి యోజన ద్వారా చాలా మౌలిక ప్రాజెక్టులపై భారీగా ఖర్చు పెట్టామని తెలిపారు. తెలంగాణలోనే 1.10 లక్షలకోట్లు ఖర్చు అవుతున్నాయని పేర్కొన్నారు. 2024 నాటికి రెండు లక్షలకోట్లు ఖర్చు చేయబోతున్నట్టు తెలిపారు. నాగ్‌పూర్ విజయవాడ రహదారికి కూడా శంకుస్థాపన చేసినట్టుపేర్కొన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్‌లో 400 కిలోమీటర్లు తెలంగాణలోనే ఉందని గుర్తు చేశారు గడ్కరీ. హైవేలతో వ్యాపార అభివృద్ధి జోరు పెరుగుతుందన్నారు. ఈ హైవేలతో ఎగుమతులు, దిగుమతుల పెరగనున్నాయి అన్నారు. ఉత్తరాదిని, దక్షిణాదిని జాతీయరహదారులతో పూర్తిగా అనుసంధానం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జాతీయ రహదారుల అభివృద్ధి, రైల్వేల అభివృద్ధి విషయంలో, మౌలిక వసుతల కల్పనలో అంకిత భావంతో పని చేస్తున్నామన్నారు కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి. తెలంగాణ ఏర్పడేనాటికి 2000 కిలోమీటర్లే జాతీయ రహదారులు ఉండేవని... 9 ఏళ్లలో మోదీ ప్రధాని అయ్యాక మరో 2500 కిలోమీటర్లు ఇచ్చామని తెలిపారు. 33 జిల్లాల్లో జాతీయ రహదార్లను పూర్తి చేశామన్నారు. సికింద్రబాద్ రైల్వేస్టేషన్ 720 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎయిర్‌పోర్టు ఎలా ఉంటుందో దాన్ని ఆ విధంగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. హైదరాబాద్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీ ఎస్ ఏర్పాటు చేయబోతున్నారు. హైదరాబాద్ వరంగల్ వరకు సిమెంట్ రోడ్డును 1900 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. వరంగల్ నడిబొడ్డున 150 ఎకరాల్లో రైల్వే మ్యానిఫాక్చరింగ్ యూనిట్ వస్తోందని... ఇక్కడ రోజుకు ఏడు వ్యాగన్లు చొప్పున ఏడాదికి 2400 ఉత్పత్తి చేయబోతున్నారని వివరించారు. ఫస్ట్ ఫేజ్‌లో 500 కోట్ల పెట్టుబడు పెడుతున్నారని...ఇది పూర్తి అయితే 3000 ఉద్యోగాలు రాబోతున్నాయన్నారు.

## భద్రకాళి అమ్మవారికి మోడీ పూజలు

ప్రధాని మోదీ శనివారం ఉదయం వరంగల్ చేరుకున్న ఆయన భద్రకాళీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు ప్రధాని మోదీకి ఆలయ పూజారులు పూర్ణకుంభ



స్వాగతం పలికారు. ఈ క్రమంలో ప్రధాని కోసం ఆలయ అధికారులు 6 రకాల ప్రసాదాలను ప్రత్యేకంగా తయారు చేయించారు.వారణాసి నుంచి ప్రత్యేక విమానంలో హకీంపేట చేరుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెలికాప్టర్‌లో వరంగల్ బయల్దేరి వెళ్తారు. ముందుగా మామునూరు చేరుకోనున్న ప్రధాని అక్కడి నుంచి మళ్లీ రోడ్డు మార్గంలో భద్రకాళి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రయాణించే రోడ్డు మార్గంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రధానమంత్రి సెక్యూరిటీ ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకొని పూర్తి తనిఖీలు చేశారు. దారి పొడవునా జామర్లు పెట్టారు. యాంటీ డ్రోన్స్ టీంలు నిఘా పెట్టాయి. భద్రకాళి టెంపుల్‌లో పూజలు చేసిన అనంతరం బహిరంగ సభ జరిగే హన్మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు వచ్చారు. ఆదే వేదికపై నుంచి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసగించారు.. హైదరాబాద్ నుంచి రాజస్థాని టూర్‌కు వెళ్తారు. ఈ వరంగల్ రెండున్నర గంటల టూర్‌లో ప్రధాని మోదీ దాదాపు 6,100 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఇందులో రైల్వే వ్యాగన్ మ్యానుఫాక్చరింగ్ యూనిట్, 176కిలోమీటర్ల జాతీయ రహదారులకు శంకుస్థాపన చేస్తారు. హన్మకొండలో రెండు సభలను ఏర్పాటు చేశారు. ఒకటి అభివృద్ధి పనుల శంకుస్థాపనకు ఉపయోగిస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించేందుకు మరో సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు విజయసంకల్ప సభగా బీజేపీ నాయకులు పిలుస్తున్నారు. సీఎం ప్రసంగానికి ఐదు నిమిషాలు కేటాయిస్తూ షెడ్యూల్ విడుదల ప్రధాని పాల్గొనే సభలో తెలంగాణ సీఎం ప్రసంగం ఉంటుందని షెడ్యూల్‌లో పెట్టారు. ముందు కిషన్ రెడ్డి తర్వాత నితిన్ గడ్కరీ మాట్లాడిన అనంతరం సీఎంకు ఛాన్స్ ఇచ్చినట్టు అందులో ఉంది. వీళ్ల ప్రసంగాలకు 15 నిమిషాలు కేటాయించారు. ప్రధాని 15 నిమిషాలు మాట్లాడనున్నారు. ఈ సభలో 8 మందే కూర్చుంటారని అందులో వివరించారు. ప్రధానితోపాటు ఇద్దరు కేంద్ర మంత్రులు, గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్, కరీంనగర్, వరంగల్ ఎంపీలు బండి సంజయ్, దయాకర్, రాష్ట్ర మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మాత్రమే వేదికపై కూర్చునే ఛాన్స్ ఇచ్చారు. కిషన్‌రెడ్డి అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరుగుతున్న తొలి సభ కావడంతో తెలంగాణ బీజేపీ దీన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి జనసమీకరణ చేపట్టారు. ఓవైపు కిషన్ రెడ్డి, మరోవైపు ఎంపీ బండి సంజయ్ ఇద్దరూ వరంగల్‌లో మకాం వేసి మరీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ థార్ వాహనాన్ని నడిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

వరంగల్‌కు చేరుకున్న నేతలు, కార్యకర్తలతో వరంగల్ రోడ్లు కిక్కిరిసిపోయాయి. ప్రజలకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బీజేపీ స్టేట్ పార్టీ ఏర్పాట్లు చేసింది. ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించింది. ట్రాఫిక్ జామ్ లేకుండా ప్రత్యామ్నాయ రూట్లను కూడా సూచించింది. రెండు రోజుల క్రితమే హన్మకొండ ఆర్ట్ కాలేజీ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంది ప్రధాని సెక్యురిటీ సిబ్బంది. సుమారు పాతిక కిలోమీటర్ల వరకు నో ఫ్లైజోన్‌గా ప్రకటించింది. ఎస్పీజీ సెక్యురిటీకి తోడు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ టీమ్స్ కూడా భద్రతను చూస్తున్నాయి. వరంగల్ మామునూరు నుంచి భద్రకాళీ ఆలయానికి పయనమైన ఆయనకు బీజేపీ కార్యకర్తలు, అభిమానులు 'మోదీ మోదీ' అని నినాదిస్తూ ఆహ్వానించారు.

# దుక్కి దున్ని వరి నాట్లు వేసి...

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ తమ ట్విటర్ ఖాతాలో పంచుకోగా ప్రస్తుతం ఇవి వైరల్గా మారాయి. ఢిల్లీ నుంచి సిమ్లా వెళ్తున్న ఆయన మార్గమధ్యంలో సోనిపట్లో ఆగారు. బరోడా, మదీనాలోని పలు గ్రామాల్లో తిరిగిన ఆయన పొలం పనుల్లో ఉన్న రైతులతో ముచ్చటించారు. ఆ తర్వాత పొలంలోకి దిగి ట్రాక్టర్ నడిపారు. రైతులతో కలిసి వరి నాట్లేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భారత్ జోడో యాత్ర చేపట్టిన తర్వాత నుంచి రాహుల్ ఈ మధ్య కాలంలో అనేక రంగాలకు చెందిన ప్రజలతో మమేకమవుతున్నారు. ఇటీవల ఢిల్లీ - చండీగఢ్ హైవేపై ట్రక్కు నడిపి లారీ డ్రైవర్ల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఆయన ఆ తర్వాత ఓ మెకానిక్ దుకాణంగా బండిని రిపేర్ చేస్తూ కన్పించారు. ఇటీవల అమెరికాలో పర్యటించిన సమయంలోనూ రాహుల్ ట్రక్కులో ప్రయాణించిన విషయం తెలిసిందే. కాగా గత లోక్సభ ఎన్నికల సమయంలోనూ రాహుల్ ట్రాక్టర్ నడిపారు.

# ఏసీ రైళ్లలో ప్రయాణ ఛార్జీల్లో డిస్కౌంట్ స్కీమ్

(మొదటిపేజీ తరువాయి)

చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.ఇటువంటి ఏసీ రైళ్ల ప్రయాణ ఛార్జీల్లో డిస్కౌంట్ ఆఫర్ వెంటనే అమల్లోకి వస్తుందని, అయితే ఇప్పటికే టిక్కెట్లను బుక్ చేసుకున్నవారికి ఈ ఆఫర్ వర్తించదని, ఎటువంటి తిరిగి చెల్లింపులు ఉండబోవని వివరించింది.

**డిస్కౌంట్ పథకం వివరాలు :**

- ఏసీ చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాసెస్‌కు మాత్రమే ఈ డిస్కౌంట్ వర్తిస్తుంది. అనుభూతి, విస్టాడోమ్ బోగీలు ఉన్న రైళ్లు సహా ఏసీ సిట్టింగ్ అకామడేషన్ ఉన్న అన్ని రైళ్లకూ వర్తిస్తుంది.
- టిక్కెట్ మూల ఛార్జీలో గరిష్ఠంగా 25 శాతం డిస్కౌంట్ ప్రయాణికునికి లభిస్తుంది. అయితే రిజర్వేషన్ ఛార్జీలు, సూపర్‌ఫాస్ట్ ఛార్జీలు, జీఎస్‌టీ వేర్వేరుగా విధిస్తారు.
- వందే భారత్ రైళ్లలో గడచిన 30 రోజుల్లో 50 శాతం కన్నా తక్కువ ఆక్యుపెన్సీ ఉన్న రైళ్లలో బేస్ ఫేర్ (మూల ఛార్జీ)పై గరిష్ఠంగా 25 శాతం డిస్కౌంట్ లభిస్తుంది.
- ఈ డిస్కౌంట్ పథకం గరిష్ఠంగా ఆరు నెలలపాటు అమలవుతుంది. డిమాండ్‌నుబట్టి నెలవారీ లేదా సీజనల్ లేదా వారాంతపు రోజులు ఈ పథకం అమలవుతుంది.

# అంగన్వాడీలో 19 రకాల వస్తువులతో కిట్లు

**గుంటూరు, జూలై 8 :**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారుల కోసం అద్భుతమైన కిట్లను అందించేందుకు సిద్ధం అవుతోంది. ఆడుతూ పాడుతూ చదువుకునే చిన్నారుల మేధస్సుకు పదును పెట్టే విధంగా ఉండే వస్తువులను ఈ కిట్టులో చేర్చింది. ఒక పలక, రెండు పెన్సిళ్లు, 12 స్కచ్ పెన్సిళ్లు, ఓ రబ్బర్, షార్ప్ నర్ తో కూడిన కిట్టును ప్రతీ విద్యార్థికి ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అయితే ఈ నెలాఖరులోగా వీటిని చిన్నారులను అందివ్వాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. 3 నుంచి ఆరేళ్ల వయసు గల చిన్నారులకు ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ అందించి... వారి చుదవుకు బలమైన పునాదులు వేసేలా ఈ కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న 8.50 లక్షల మంది పిల్లలకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని చేపట్టబోతుంది. ఇటీవలే 19 రకాల ఆట వస్తులతో ఒక్కో అంగన్వాడీ కేంద్రానికి ఒక్కో కిట్టును అందజేసింది. ఆ కిట్ లో చిన్నారులకు ఉపయోగపడే మ్యాట్, సాఫ్ట్ బాల్, చెక్కతో చేసిన సంఖ్యల పజిల్, పెగ్ బోర్డు, అబాకస్, చెక్క బూట్లు, బిల్డింగ్ బ్లాక్ లు, గమ్ స్టిక్స్, 25 ముక్కల రంగుల పేపర్లు, 5 సెట్ల వాటర్ కలర్స్, 5 సెట్ల స్కెచ్ పెన్నులు, 5 ప్యాకెట్ల పెన్సిళ్లు, 5 రబ్బర్లు, 5 షార్ప్ నర్లు. నమూనాల ట్రేసింగ్ బోర్డు, డాఫ్లి, బ్లోయింగ్ సంగీత వాయిద్యాలు, 20 పలకలు బొమ్మలు తయారు చేసేలా 5 సెట్ల మౌల్డింగ్ క్లే, మూడు ప్యాకెట్ల డస్ట్ ఫ్రీ సుద్ధలు, బంతితో బాస్కెట్ బాల్ హోప్, 20 కథల పుస్తకాలు అందించారు. ఇదే కాకుండా అంగన్‌వాడీలకు అందించే ఆహారంలో మునగాకును ప్రభుత్వం చేర్చింది. ఇప్పటి వరకు పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన మెను విజయవంతం అవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని చూస్తోంది ప్రభుత్వం. పోషక విలువలు ఎక్కువ ఉండే మునగాకు వారానికి రెండు రోజులు అందివ్వనున్నారు. దీని వల్ల గర్భిణులు బాలింతలు, చిన్నారల ఆరోగ్య సమస్యలకు చెక్ చెప్పవచ్చని ఆలోచన. మునగాకు చేసే మేలు మరే ఇతర ఆకు కూరలు చేయవని చాలా మంది నమ్ముతున్నారు. రోజువారి ఆహారంలో దీన్ని భాగంగా చేసుకోమని వైద్యులు కూడా చెబుతున్నారు. పసిబిడ్డలకు పాలిచ్చే తల్లులు మునగాకును తీసుకుంటే పిల్లల ఆరోగ్యం బాగుంటుంది. దీన్ని ఏ రూపంలోనైనా తీసుకోవచ్చు.మునగాకులో పోషకాలు, ఖనిజాలు, ఫైబర్ ఉంటాయి. చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. జుట్టు పెరుగుదలను మెరుగుపరుస్తుంది. మునగాకులో ఉంటే ఫ్లేవానాయిడ్లు కారణంగా రక్తపోటును తగ్గిస్తుంది. చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో, రక్తంలో చక్కెర, కొవ్వులను నియంత్రించి.. గుండె పని తీరు మెరుగు పరచడంలో ఇది బాగా పని చేస్తుంది. అందుకే దీన్ని అంగన్‌వాడీ మెనూలో చేర్చాలని ప్రభుత్వం ప్లాన్ చేసింది. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టింది. ఓ గ్రామంలో మునగ చెట్లను పెంచి ఆ చెట్టు నుంచి వచ్చే ఆకులను గర్భిణులకు, బాలింతలకు అందజేసింది. మునగాకు పప్పు, మునగాకు కూర ఇలా ఏదో రూపంలో లబ్దిదారులకు అందజేసింది. వారానికి రెండు రోజులు దీన్ని ఇవ్వాలని ఇప్పుడు నిర్ణయించారు.

# రైతు రాజ్యం... మోసం చేసే రాజ్యమా..


తెలిపారు. ఏ సీజన్‌లో పంటనష్టం జరిగినా ఆ సీజన్ ముగియక ముందే పరిహారం అందిస్తున్నామన్నారు. సున్నా వడ్డీకి రైతులకు రుణాలు అందిస్తున్నాం. సున్నా వడ్డీ రుణాల్లో ఏపీ అగ్రగామిగా ఉందన్నారు. "రైతులకు ఎప్పటికీ ఉచిత విద్యుత్ ఇచ్చేలా విద్యుత్ కొనుగోలు ఒప్పందం? చేసుకున్నాం. చుక్కల భూములకు సంపూర్ణ భూహక్కు కల్పించాం. పశువుల కోసం 340 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశాం. పాడి రైతులకు ఆదాయం వచ్చేలా అమూల్‌ను తీసుకొచ్చాం" అని సీఎం తెలిపారు.పంటలకు గిట్టుబాటు ధర కోసం రూ. 3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామని జగన్ ప్రకటించారు. ధాన్యం కొనుగోళ్ల కోసం నాలుగేళ్లలో రూ.58,767 కోట్లు ఖర్చు చేశాం. ఇతర పంటల కొనుగోళ్ల కోసం మరో రూ.7,633 కోట్లు ఖర్చు చేశాం. రైతులకు పగటిపూటే 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. మనకు పాడిపంటలు ఉండే పాలన కావాలా? లేక నక్కలు, తోడేలు ఉండే పాలన కావాలా? అని రైతుల్ని ప్రశ్నించారు.

రైతు రాజ్యం కావాలా? రైతులను మోసం చేసే పాలన కావాలా? అని రైతుల్ని జగన్ ప్రశ్నించారు. రైతుకు తోడుగా ఆర్బీకే వ్యవస్థ కావాలా? దళారీ వ్యవస్థ కావాలా?. పేదల ప్రభుత్వం కావాలా? పెత్తందారుల ప్రభుత్వం కావాలా?. ఏ ప్రభుత్వం కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో పేదలను చంద్రబాబు ఎందుకు పట్టించుకోలేదు. చంద్రబాబు పాలనలో డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో ఇంకా మోసం చేసే ప్రయత్నం చేస్తారు. నైతికత లేని వ్యక్తిని చంద్రబాబు అంటారన్నారు. వీళ్లలా తనకు అబద్ధాలు చెప్పడం రాదన్నారు.

**వైయస్ రాజశేఖర్ రెడ్డి నివాళులర్పించిన సీఎం జగన్ ,వైయస్ విజయమ్మ....**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ. జయంతి సందర్భంగా ఇడుపులపాయ వైస్సార్ ఘాట్ లో పూలమాలవేసి,ప్రత్యేక ప్రార్ధనలు చేసిన సతీమణి వైయస్.విజయమ్మ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాష,జిల్లా ఇన్చార్జి మంత్రి ఆదిమలపు సురేష్,కడప జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు సురేష్ బాబు,ఆంధ్రప్రదేశ్ పలు శాఖల డైరెక్టర్,చైర్మన్లు, వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్త రాజకీయ పునరేకికరణ సాధ్యమా







**విజయవాడ, జూలై 8 :**

ఏపీలో వైసీపీ నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించడమే ఉమ్మడి లక్ష్యంగా ప్రధాన ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. దానికి అనుగుణంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ చక్కటి రాజకీయ పరిణితిని ప్రదర్శిస్తున్నారు. దీంతో సరికొత్త రాజకీయ పునరేకీకరణకు పునాది పడనుంది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో శుభపరిణామమే అవుతుంది. ఇప్పటికిప్పుడు పొత్తు పొడవకపోయినా ఎన్నికల సమయానికి అందరూ కలిసి పనిచేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. దానికి తగ్గట్లే ప్రతిపక్షాల అడుగులు ముందుకు పడుతున్నాయి. అధికారికంగా పొత్తులపై ఎవరూ ప్రకటించకపోయినప్పటికీ పొత్తులు మాత్రం ఖాయంగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ప్రజాస్వామ్యాన్ని హననం చేస్తూ, వ్యక్తి స్వేచ్ఛను హరిస్తూ పౌర హక్కులను ప్రభుత్వం కాలరాస్తుంది.వైసీపీ ప్రభుత్వంతో రాష్ట్రానికి ఎలాంటి మేలు లేదని బాహటంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర శ్రేయస్సును కోరి భావసారూప్యం కలిగిన వ్యక్తులు, పార్టీలు ఒక తాటిపైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని గుర్తించారు. ప్రతిపక్షాలు జట్టుగా పోటీచేస్తే ఓటమి తప్పదని వైసీపీ కలవరపడుతోంది. అందుకే దమ్ముంటే ఒంటరిగా పోటీ చేయాలని రెచ్చగొడుతున్నారు. విడివిడిగా పోటీ చేయడమా, జట్టు కట్టడమా అనేది ఆయా పార్టీల అంతర్గత వ్యవహారం. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి పోటీచేస్తాయనే చర్చ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఈ కలయిక రాష్ట్ర ప్రజల్లో ఉన్న అభద్రతాభావాన్ని, భయాన్ని పోగొట్టి నైతిక స్థైర్యం నింపుతుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓట్ల చీలికల వల్ల జరిగిన నష్టాన్ని గుర్తించి, ఈసారి అది పునరావృతం కాకూడదని రాష్ట్ర ప్రజలు, రాజకీయ పార్టీలు చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. దీనికోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవ చూపి తన వంతుగా అనేక సందర్భాల్లో బీజేపీతో సంప్రదింపులు జరిపారు. దీనికోసం రోడ్ మ్యాప్ అడిగారు. బీజేపీ నుంచి సరైన స్పందన రానప్పటికీ పవన్ కల్యాణ్ ఎక్కడా తన వంతు ప్రయత్నం ఆపలేదు. కర్ణాటక ఎన్నికల్లో ఎదురైన ఓటమితో బీజేపీ కళ్లు తెరచి ఒక మెట్టు దిగినట్టుంది.బీజేపీ జాతీయపార్టీ అయినప్పటికీ ఏపీలో దాని ప్రభావం అంతంత మాత్రమే. కానీ బీజేపీతో పొత్తు వలన ఎన్నికల సమయంలో జగన్ అధికార దుర్వినియోగానికి అడ్డుకట్టపడుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్నికల కమిషనర్ అక్రమాలను నిరోధించే ప్రయత్నం చేశారు. కానీ ఎన్నికలలో జరిగే దౌర్జన్యాలను, రిగ్గింగ్‌లను, బలవంతపు ఏకగ్రీవాలను, అభ్యర్థులపై దాడులను నిలువరించలేకపోయారు. దీంతో ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీతో కలిసి ముందుకు సాగాలనుకుంటున్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే .రెండోవైపు బీజేపీతో పొత్తు వలన ఎంత ప్రయోజనం ఉందో అంతకంటే రెట్టింపు నష్టం కూడా ఉంది. ముస్లీం మైనార్టీ ఓట్లకు భారీగా గండిపడే ప్రమాదం ఉంది. అలాగే కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేసిందనే భావన ఉంది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన దానికంటే బీజేపీ ఓటమి పట్ల పార్టీలకతీతంగా ఎక్కువమంది సంతోషించారు. రాజధాని లేని రాష్ట్రంగా చేశారని మాట్లాడటం తప్ప చేతల్లో బీజేపీ ఎలాంటి ప్రయత్నం చేయలేదు. పైగా ఆర్-5 జోన్ లో ఆఘమేఘాలపై 47 వేల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు రూ.750 కోట్లు నిధులు సమకూర్చారు. అలాగే రుణపరపతిపై ఎలాంటి ఆంక్షలు విధించకుండా ఆంధ్రప్రదేశ్‌ను రుణాల ఊబిలో నెట్టేందుకు తమవంతు సహకారాన్ని అందించారు. వివేకానందరెడ్డి హత్య కేసులో అన్ని వ్యవస్థలు జగన్ రెడ్డికి అనుకూలంగా పనిచేసేలా బీజేపీ కేంద్ర నాయకత్వం వ్యవహరిస్తోందనే భావన రాష్ట్ర ప్రజానీకంలో ఉంది. ఆంధ్రాలో లిక్కర్ స్కామ్‌తో పోలిస్తే ఢిల్లీలో లిక్కర్ స్కామ్ చాలా చిన్నది. ఇక్కడ రూ.42 వేల కోట్ల భారీ కుంభకోణం లిక్కర్ స్కామ్ జరిగింది. కానీ ఇక్కడ ఎలాంటి కేసులు లేవు. ఇలాంటి భారీ స్కామ్‌లపై స్పందించకపోవడంలో ఉన్న ఆంతర్యం ఏమిటి?ఇటీవల ఉత్తరాంధ్ర, రాయలసీమలో రెండు రోజుల వ్యవధిలో బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటించి, వైసీపీ పాలనపై దుమ్మెత్తిపోస్తూ ముప్పేట దాడి చేశారు. రైతు ఆత్మహత్యలపై, రాష్ట్రం విద్రోహ శక్తులకు, భూకబ్జాలకు అడ్డాగా మారిందని. ఫార్మా, మైనింగ్ రంగాల్లో దోపిడీ జరిగిందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. కానీ వైసీపీ నుంచి ఎలాంటి స్పందనా లేదు. కానీ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో రజనీకాంత్ చంద్రబాబును పొగిడితే, దీనిని రాద్దాంతం చేస్తూ రాష్ట్ర మంత్రులు, వైసీపీ నాయకులు తీవ్రమైన పదజాలంతో రజనీకాంత్‌పై దుమ్మెత్తి పోశారు. ఒకవైపు బీజేపీ వైసీపీకి సహకారాన్ని అందిస్తూ.. మరోవైపు ఆరోపణలు చేయడం వెనుక ఉద్దేశం అర్థం కావడం లేదు. రాష్ట్రం ఇన్ని కుంభకోణాలు చేస్తుందని విమర్శించే మీరు. అప్పుల రూపంలో కోట్లాది రూపాయలు ఎందుకు సమకూరుస్తున్నారు. వీటన్నింటిని పరిశీలించినప్పుడు బీజేపీ నిజస్వరూపం తేటతెల్లమవుతోంది. ఏపీ ప్రజలకు బీజేపీ పట్ల ఇంత అసంతృప్తి, అపనమ్మకం ఉన్నప్పుడు ఎలా కలిసి ముందుకు సాగుతారు ఇవన్నీ తెలుగుదేశం, జనసేన ముందున్న సవాళ్లు. పైగా పొత్తు కుదిరితే సీట్ల సర్దుబాటు టీడీపీకి పెద్ద తలనొప్పిగా మారే ప్రమాదం ఉంది. మిత్రపక్షాలకు కేటాయించే సీట్లల్లో నాలుగేళ్లు తెలుగుదేశం పార్టీ ఇంఛార్జ్‌ల రూపంలో సమయాన్ని, ఆర్థిక వనరులను వెచ్చింది అధికార పక్షంపై పోరాటం చేశారు. పొత్తు కుదిరితే వాళ్ళని ఎలా బుజ్జగిస్తారు.నిజానికి బీజేపీకి రాష్ట్రంలో ఒక్క శాతం సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లే వచ్చాయి. ఇప్పటికే తటస్థులు ఆ రెండు పార్టీల పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. కానీ ఈ పొత్తు వలన మిత్రపక్షాలకు కేటాయించిన సీట్లలో వైసీపీకి పోయే ప్రమాదం ఉందని టీడీపీలోని ఒక వర్గం వాదిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి అనుకూలమైన వాతావరణం ఉన్నప్పుడు పొత్తులు ఎందుకని సీట్లు ఆశిస్తున్న కొంతమంది నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య ఎలా నెట్టుకురాగలరనేది రాజకీయ విశ్లేషకులకు అంతుబట్టడం లేదు. చంద్రబాబు చాణక్యం ఎంత వరకు పనిచేస్తుందో వేచి చూడాలి.గత ఎన్నికల్లో బీజేపీతో కలవకపోవడం ఎంత తప్పో.. ఇప్పుడు అంతే. బీజేపీ, వైసీపీ ఎత్తుగడల్లో తెలుగుదేశం, జనసేన పావులుగా మారకూడదు. మోడీ దత్తపుత్రుడు జగనేనని స్వయంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన మాటలు గుర్తుచేసుకోవాలి. దొంగ ఓట్లు, నకిలీ మద్యం, అవినీతి డబ్బే ఎన్నికల్లో జగన్‌కు అస్త్రాలు కాబోతున్నాయి. ఎన్ని అస్త్రాలు ప్రయోగించినా ప్రజలు మాత్రం మార్పు కోరుకుంటున్నారు. దానికి తగ్గట్లు తెలుగుదేశం, దాని మిత్రపక్షాలు వ్యవహరించాలి. పదేపదే నిర్ణయాలు మార్చుకున్నా, స్థిరమైన ఆలోచనలు లేకపోయినా, పొత్తుల్లో హేతుబద్ధత లోపించినా ప్రత్యర్థికి లాభం చేకూరుతుంది. అందుకే పొత్తులపై ఆచితూచి అడుగులు వేయాలి. ఎవరితో కలవాలి, ఎవరితో కలవకూడదనేది తెలుగుదేశం పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయం. లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

# ఎమ్మెల్యేలకు దళిత బంధు టెన్షన్

**నల్గొండ, వరంగల్, జూలై 8:**

ఇప్పుడున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ వచ్చే ఎన్నికల్లో అందరికీ టికెట్ ఇస్తం..ఇది ఒకటికి రెండు సార్లు పార్టీ మీటింగ్‌లలో తెలంగాణ సీఎం కేసీఆర్ స్వయంగా చెప్పిన మాట. దీంతో అంతా అనుకున్నట్లు జరిగితే బాగుంటుంది అని అందరూ సిట్టింగ్ ఎమ్మెల్యేలు అనుకున్నారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ వర్గాల్లో అది కూడా ప్రగతి భవన్ సర్కిల్ లో జరుగుతున్న ప్రచారం తో సిట్టింగ్ లలో మళ్ళీ టెన్షన్ పుట్టిస్తోంది. ఇప్పుడున్న పరిస్థితులు మరీ ముఖ్యంగా.. దళిత బంధులాంటి ప్రతిష్టాత్మక స్కీమ్ లో ఎమ్మెల్యేల చేతివాటంపై సీఎం కేసీఆర్‌కు అందిన రిపోర్ట్స్ ను బట్టి 25 నుంచి 30 స్థానాల్లో సిట్టింగ్‌లను మార్చక తప్పదని ఆ పార్టీ ముఖ్య నేతలు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడ.. ఎవరికి టికెట్ ఇవ్వాలి..ఎవరికి టికెట్ ఇస్తే ఓడిపోతారో అనేది ఇప్పటికే ఒక బ్లూ ప్రింట్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ బ్లూ ప్రింట్ ఆధారంగానే 25 నుంచి 30 స్థానాల్లో సిట్టింగ్ లను పక్కన పెట్టక తప్పదనే అంచనాకు ప్రగతి భవన్ పెద్దలు వచ్చినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాల వారీగా నాలుగైదు సర్వే రిపోర్ట్స్ ను బేరీజు వేసుకొని వీరికి టికెట్ మర్చక తప్పదని ప్రగతి భవన్ పెద్దలు ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది.దానిలో భాగంగానే ప్రభుత్వ పథకాల్లో అవినీతి విషయాన్నీ ప్రస్తావించిన గులాబీ బాస్.. ఇదే రిపీట్ అయితే పార్టీ టిక్కెట్ కట్ చేయడమే కాదు పార్టీ నుండి సాగనంపడానికి కూడా వెనుకాడను అంటూ ఇటీవల హెచ్చరికలు చేయడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.మరో వైపు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, వైస్ షర్మిల తదితర విపక్ష నేతలు దళిత బంధులో అక్రమాలపై సీఎం కేసీఆర్ వ్యాఖ్యలను సుమోటా తీసుకోను విచారణ చెయ్యాలి అంటూ అప్పట్లో టార్గెట్ చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో కనీసం నలుగురు సిట్టింగ్‌లు, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఇద్దరు, కరీంనగర్ జిల్లా లో ముగ్గురు, అదిలాబాద్ లో 3, రంగారెడ్డి 4, ఖమ్మం లో 3, నిజామాబాద్ 2, వరంగల్ లో 4, మెదక్ లో 4 సిట్టింగ్ లకు వచ్చే ఎన్నికల్లో టికెట్ కకట్ అనే వార్తలు జోరందుకున్నాయి. అటు సోషల్ మీడియాలో పలు స్థానాల్లో అభ్యర్థుల మార్పు తథ్యమన్న ప్రచారం సిట్టింట్ ఎమ్మెల్యేల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.ఎన్నికలకు కొన్ని మాసాల ముందే అభ్యర్థులను ప్రకటించాలని సీఎం కేసీఆర్ డిసైడ్ అయ్యారని తెలుస్తుంది. ఇప్పటికే పలు స్థానాల్లో సిట్టింగ్‌ల పేర్లను మంత్రి కేటీఆర్ ప్రకటించినా.. టికెట్ దక్కని వారికి ముందే సమాచారం ఇచ్చే అవకాశం లేదని పార్టీ ముఖ్య నేతలు మాట్లాడుకుంటున్నారు. టిక్కెట్ ఇవ్వడం లేదని హింట్ ఇస్తే వారు ఇతర పార్టీలకు జంప్ అయ్యే అవకాశం ఉండటంతో ఈ విషయంలో వ్యూహాత్మకంగా వ్యవహరించాలని బీఆర్ఎస్ పెద్దలు భావిస్తున్నారు.అయితే సిట్టింగ్‌లకు టిక్కెట్ కోతలపై సీఎం కేసీఆర్ ఫిక్స్ అయ్యారు కాబట్టే మొన్నటి సమావేశంలో దళిత బంధు స్కీమ్‌లో పార్టీ ఎమ్మెల్యేల చేతివాటంపై ఓపన్ అయ్యారన్న టాక్ వినిపిస్తోంది. కేవలం కామెంట్స్ మాత్రమే కాదు.. ఎవరు ఎంత వాసులు చేశారన్న జాబితా కూడా గులాబీ బాస్ టేబుల్ ముందు ఉన్నట్టు కీలక సమాచారం. మొత్తానికి ఈ వార్తలతో పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో వణుకు మొదలయ్యింది. సొంతంగా సర్వే లు చేయించుకొని.. నియోజక వర్గాల్లో పరిస్థితి ని సరిదిద్దుకునే ప్రయత్నం సిట్టింగ్ లు చేస్తున్నారు. మరో వైపు దళిత బంధు పథకంలో వసూళ్లపై పార్టీ బాస్ గరం గరం అవ్వడంతో టికెట్ వస్తుందా లేదా అనే టెన్షన్ పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తప్పడం లేదు

# ఘనంగా వైయస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు

**మంథని**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మంథని శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కార్యనిర్వహణ కార్యాలయంలో రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ 2004-09లో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తీసుకొచ్చిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్తు, ఏకకాలంలో రుణమాఫీ, పంటలకు మద్దతు ధర కల్పించినటువంటి వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ప్రతిగ్రామంలో ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేశారని,విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ సౌకర్యం కల్పించింది ఉన్నత విద్య కృషి చేశారని కొనియాడారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఉచితంగా వైద్యాన్ని అందించినటువంటి వ్యక్తి రాజశేఖర్ రెడ్డి అని, 108 ద్వారా అనేక మంది క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించడం కోసం కృషి చేశారన్నారు. జలయజ్ఞం ద్వారా అనేక ప్రాజెక్టులను శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట పూర్తి చేసినటువంటి ఘనత వైయస్సార్ ది అన్నారు.రాజశేఖర్ రెడ్డి ఆశయం రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమని శ్రీధర్ బాబు నాయకత్వంలో రాహుల్ గాంధీ ని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శశిభూషణ్ కాచే ,ఓడ్నాల శ్రీనివాస్, అజీం ఖాన్, ముసుకుల సురేందర్ రెడ్డి , గోటికారి కిషన్ జి, ఎరుకల ప్రవీణ్, మంథని సత్యం, జంజర్ల శేఖర్, రావికంటి సతీష్, పెరవేన లింగయ్య, రవితేజ గౌడ్, జనగామ నర్సింగరావు, బండారి ప్రసాద్,అలీం ఖాన్, ఐలి ప్రసాద్, ఆర్ల నాగరాజు ,బూడిద శంకర్ ,దొరగోర్ల శ్రీనివాస్, నాగులరాజయ్య, రాంరాజశేఖర్,మంథని శ్రీనివాస, ఎల్లంకి వంశీ ,గుండ రాజు, పార్వతి కిరణ్ ", నారమల్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

**ఆదిలాబాద్**
గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణికులతో వెళుతున్న ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆటోలో నలుగురు ప్రయాణిస్తున్న అక్కడికక్కడే మృతి చెందింది. ఐదుగురికి గాయాలయ్యాయి. ఇచ్చోడలో ఓ చర్చిలో తెల్లవారుజాము వరకు ప్రార్థనలలో పాల్గొని తెల్లవారుజామున 4 గంటలకు ఆదిలాబాద్‌కు వెళ్తుండగా ఘటన చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతులంతా ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మోదీకి వ్యతిరేకంగా పోస్టర్లు

**మేడ్చల్**

ప్రధాని మోదీ వరంగల్ పర్యటనను నిరసిస్తూ ఆయనకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిశాయి. నేను వరంగల్.. నాది తెలంగాణ పేరుతో దారి పొడవునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. విభజన హామీలు, గిరిజన యూనివర్సిటీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఎక్కడ మోదీజీ ప్రశ్నించారు. కాగా, ఆయన పర్యటనకు వ్యతిరేకంగా ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు.

## తాడిపత్రి లోఉద్రిక్తత

**అనంతపురం**
శనివారం నాడు తాడిపత్రిలో హై టెన్షన్ నెలకొంది. తాడిపత్రి లో మునిసిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి హౌస్ అరెస్ట్ కు రంగం సిద్ధం కావడంతో పోలీసులు అయన ఇంటి చుట్టూ మోహరించారు. బారికోడ్లు పెట్టి పహారా కాసారు. పుట్లూరు ,యల్లనూరు మండలాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించడానికి మునిసిపల్ ఛైర్మెన్ జెసి ప్రభాకర్ రెడ్డి వెళతానని అనడంతో వివాదం చెలరేగింది. పుట్లూరు మండలంలో ఉన్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతి రెడ్డి పెద్దా రెడ్డి తోట వద్దకు వెళతారనే సమాచారంతోనే హౌస్ అరెస్ట్ కు పోలీసులు ప్రయత్నం చేసారు. అయితే, జేసీ మాత్రం నేను ఖచ్చితంగా వెల్లితీరుతానని పట్టుపడుతున్నారు.

## హృదయాలను దోచుకున్న నేత వైఎస్సార్

**కడప**
ఇడుపులపాయలో వైఎస్ షర్మిల దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కి నివాళులర్పించారు. తరువాత ఆమె మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ గొప్ప నాయకుడు. వైఎస్సార్ ను అభిమానించే ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మరోసారి వైఎస్సార్ ను గుర్తు చేసుకునే అవకాశం వచ్చింది. వైఎస్సార్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిదేమీ లేదు. ఎందుకంటే రుణమాఫీ, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్యశ్రీ వంటి వన్నీ పేదలకు ఆయన అందించిన ఫలాలే. ఐదేళ్లలో 46 లక్షల పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వడం వైఎస్సార్ కే సాధ్యం అయ్యింది. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ ఇచ్చారు. అన్ని వర్గాల హృదయాలను దోచుకున్న నేత వైఎస్సార్. వైఎస్సార్ అభిమానులకు, ఆయనను ప్రేమించే ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు..

## ఆర్టీసీ బస్సు బోల్తా

**అనకాపల్లి**
అనకాపల్లి జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. శనివారం తెల్లవారు జాము న జంగారెడ్డి గూడెం నుండి విశాఖప ట్నం వెళున్న ఆర్టీసీ బస్సు, కాసింకోట దగ్గర జాతీయ రహదారిపై బోల్తా కొట్టిం ది. ఈ ప్రమాదం లో దాదాపు 30 మందికి గాయాలు అయ్యాయి. పెద్ద ప్రమాదం జరుగకపోవడంతో వారంతా ప్రాణాలతో బయటపడ్డారు. ముందు వెళ్తున్న లారీని వెనుక నుండి ఢీకొని అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకు పోయింది. బస్సు డ్రైవర్ తప్పిదం ఉందని స్థానికులు అంటున్నారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసారు. గాయపడిన వారిని స్థానిక హాస్పటల్ లో చేర్పించారు.

## రోడ్డు ప్రమాదంలో ఆర్టీవో మృతి



**కడప**
కడప నగరం ఆలంఖాన్ పల్లి ఇస్కాన్ సర్కిల్ రాజశఖరరెడ్డి విగ్రహం సమీపంలో రోడ్డు ప్రమాదం శనివారం ఉదయం జరిగింది. ఒక లారీ అదుపు తప్పి మినీ లారీని ఢీకొంది. మినీ లారీ ఢీకొని పక్కనే ఉన్న ఆర్టీవో వాహనంపై ఆ లారీ పడింది. ఈ ప్రమాదంలో కారులో వున్నఆర్టీవో శివప్రసాద్ తో పాటు కానిస్టేబుల్ కేశవ మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అందుబాటులోకి కవచ్...

**శ్రీకాకుళం, జులై 8 :**

టెక్నాలజీలో కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సైబర్ మోసాలు కూడా పెరిగిపోతున్నాయి. మనకు తెలియకుండానే మన మొబైల్స్‌లోకి ఏవేవో యాప్‌లు వచ్చి చేరుతున్నాయి. అలా వచ్చి చేరుతున్న యాప్‌ల విషయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా మనకు తెలియకుండానే సాఫ్ట్‌వేర్‌లు ఇన్‌స్టాల్ అయి ఫోన్‌లో డేటా సైబర్ కేటుగాళ్ల చేతికి చేరిపోతుంది. అలా సేకరించిన డేటాతో మన వ్యక్తిగత సమాచారం సేకరించి మనల్ని బ్లాక్ మెయిల్ చేసేవారు కొందరైతే?లింకులు, ఆ యాప్‌ల ద్వారా మన బ్యాంక్ అకౌంట్లును ఖాళీ చేసేస్తున్నారు మరికొందరు. జరగవలసిన నష్టమంత జరిగి, మన అకౌంట్ ఖాళీ అయ్యాక గాని సైబర్ మోసం జరిగినట్లు గుర్తించలేము. మరికొందరికి అయితే ఈ యాప్‌ల విషయంలో కాస్త అనుమానం వచ్చినా వాటిపై క్లారిటీ తీసుకునేందుకు ఎవరినీ సంప్రదించాలి, ఎలా బయటపడాలి అనేది తెలియదు.ఇలాంటి మోసాలకు చెక్ పెట్టేందుకు శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖ ఓ అడుగు ముందుకేసింది. సైబర్ నేరాలకు చెక్ పెట్టేందుకు పబ్లిక్ కోసం శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద దిశ సైబర్ కవచ్ సాఫ్ట్‌వేర్ మిషన్ ను అందుబాటులోకి తెచ్చింది. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సైబర్ మిషన్‌కు కనెక్ట్ చేసి స్కాన్ చేస్తే అందులో ఉన్న వైరస్,సైబర్ మాల్వార్‌తో పాటు తెలియకుండా ఇన్స్టాల్ అయిన యాప్‌లను కూడా గుర్తించి తొలగించవచ్చు. దిశ సైబర్ కవచ్ చూడటానికి ఏటీఎం మిషన్ తరహాలోనే ఉంటుంది. మొబైల్ ఛార్జింగ్ పిన్ నుంచి యూఎస్‌బీ కేబుల్ ద్వారా సైబర్ కవచ్ మెషిన్‌కు అనుసంధానం చేస్తే.. ఆ మొబైల్‌లో ఉన్న సమాచారాన్ని బట్టి వైరస్‌ను గుర్తించవచ్చు. వాటిని వెంటనే డిలీట్ చేసుకోవచ్చు.
ఎవరైనా సరే వచ్చి తమ కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ మెషిన్‌కు ఫోన్‌ను అనుసంధానం చేసి వైరస్‌ను డిలీట్ చేసుకోవచ్చనీ.. తమ సిబ్బంది కూడా సహాయం అందిస్తారని జిల్లా ఎస్పీ జి.ఆర్. రాధిక చెబుతున్నారు. ఈ మెషిన్ దగ్గర సహాయంగా ఉండేందుకు ఒకరికి శిక్షణ కూడా ఇచ్చామని ఎవరైనా వచ్చి ఈ సేవలను ఉచితంగా పొందవచ్చని తెలిపారు .ఈ మోనిటర్ ద్వారా ఎటువంటి వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించబడదని కూడా ఎస్పీ స్పష్టం చేశారు.సైబర్ మోసాలకు చెక్ పెట్టేలా దిశ సైబర్ కవచ్ సాఫ్ట్‌వేర్ మిషన్ ఎంతగానో ఉపయోగ పడుతుం దంటున్నారు.

# దసరా నాటికి టీడీపీ రెడీ

**విజయవాడ, జులై 8:**

ఎన్నికలకు 10 నెలల ముందే మొదట విడత మేనిఫెస్టో ప్రకటించిన తెలుగుదేశం పార్టీ.. రెండో విడత మేనిఫెస్టోపై కసరత్తు మొదలుపెట్టింది. రాజమండ్రి మహానాడు వేదికగా ఫస్ట్ ఫేజ్ మేనిఫెస్టోను భవిష్యత్ కు గ్యారంటీ పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేసారు. మహిళలు, యువత, రైతులు, బీసీలు, ఇంటింటికీ మంచినీరు,పూర్ టు రిచ్ వంటి ఆరు అంశాలతో తొలి మేనిఫెస్టోను ప్రకటించారు. ఈ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లున్నారు పార్టీ నాయకులు.మొత్తం 5 జోన్ లలో బస్సుయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి మేనిఫెస్టోను వివరించడంతో పాటు వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటున్నారు టీడీపీ నాయకులు.ఇక వచ్చే దసరాకు రెండో విడత మేనిఫెస్టోను ప్రకటించేలా టీడీపీ కసరత్తు మొదలుపెట్టింది. రెండో విడత మేనిఫెస్టోలో ఏయే అంశాలకు పెద్దపీట వేయనున్నారన్నది ఏపీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది. ఉద్యోగులతో పాటు మధ్యతరగతి వారికి సంబంధించిన అంశాలను రెండో విడతలో ప్రకటించనున్నట్లు తెలిసింది. అధికారంలోకి వస్తే అమరావతితో పాటు ఏపీ మొత్తం అభివృద్ధి ఎలా చేస్తామనేది కూడా ఇందులో ప్రధానంగా పొందుపరచనున్నట్లు తెలిసింది.ఇప్పటికే మేనిఫెస్టో కమిటీ దీనికి సంబంధించిన కసరత్తు ప్రారంభించింది. వైసీపీ హయాంలో రాష్ట్ర అభివృద్ధి ఏమాత్రం జరగలేదని చెబుతున్న టీడీపీ?తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో సంపద సృష్టించడం ద్వారా రాష్ట్రఆన్ని గాడిలో పెడతామని చెప్పుకొస్తుంది.సంపద సృష్టించడం ద్వారా సంక్షేమ పథకాలకు నిధులు సమస్య లేకుండా చూస్తామంటున్నారు చంద్రబాబు. దీంతో పాటు మొదటి విడతలో మిగిలిన అంశాలతో పాటు బస్సు యాత్రల ద్వారా ప్రజల నుంచి వచ్చే సూచనలు, అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో మేనిఫెస్టోను ప్రకటించాలనుకుంటోంది టీడీపీ అధిష్టానం.రెండో విడత మేనిఫెస్టోలో రాష్ట్రాభివృద్ధికి పెద్ద పీట వేయనున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రాభివృద్ధి తిరోగమనంలో పయనిస్తోందని మేనిఫెస్టో ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. రాష్ట్ర రాజధానితో పాటు ఏ జిల్లాను ఎలా అభివృద్ధి చేస్తామనే విజన్ ను ముందుగానే ప్రకటిస్తారని చెబుతున్నారు. గతంలో కూడా జిల్లాల అభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టినప్పటికీ పలు కారణాల వల్ల పూర్తి స్థాయిలో అమలుచేయలేకపోయారు. ఈసారి మాత్రం జిల్లాల అభివృద్ధి,సాగునీటి ప్రాజెక్ట్ లు,మౌళికవసతుల కల్పన,ఉపాధి కల్పనకు సంబంధించి నిర్దిష్ట కాలపరిమితితో ముందుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారట. ఇవే అంశాలను రెండో విడత మేనిఫెస్టో లో పొందుపరుస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం.దసరా నాటికి 175 నియోజకవర్గాలకు ఇంచార్జిల నియామకం పూర్తి చేసి.. పూర్తిస్థాయి మేనిఫెస్టోను విడుదల చేసి ఎన్నికల బరిలో దిగాలనే ఆలోచనలో చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

## గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్స్ ఉద్యోగుల దీక్షకు బీజేపీ మద్దతు

**మంథని**

గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గత రెండు రోజుల నుండి మంథనిలో చేస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం బిజెపి పార్టీ బృందం సందర్శించి వారి పోరాటానికి భారతీయ జనతా పార్టీ బిజెపి మంథని మండల కమిటీ, మంథని పట్టణ కమిటీ తరఫున సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు వీరబోయిన రాజేందర్ పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండదని బూటకపు హామీలిచ్చి చిన్నచిన్న ఉద్యోగులపై అధిక పని భారం మోపడమే కాకుండా కనీసం వారికి జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొందని అన్నారు. గ్రామపంచాయతీ కారోబార్లకు గత ఐదు నెలల నుండి జీతాలు చెల్లించలేదని వారి కుటుంబాలు ఏ విధంగా జీవనం కొనసాగించాలో అయోమయ పరిస్థితిలో ఉన్నారని తక్షణమే వారి జీతాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్స్ లను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించి వారికి పిఆర్సి విధానాన్ని అమలుపరిచి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 12 గంటల దినాన్ని పెట్టి వారిచే వ్యక్తి చాకిరీ విధానానికి స్వస్తి పలికి ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని, అర్హతలు ఉన్న కారోబార్లను సహాయ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమోషన్లు ఇవ్వాలని, గ్రామపంచాయతీ ఉద్యోగులకు ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి కనీస మౌలిక ఏర్పాట్లు చేయాలని లేనిచో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల ఇంచార్జ్ పోతర వేణి క్రాంతి, ఉప అధ్యక్షులు బూడిద రాజు ,రేపాక శంకర్, పట్టణ ఉప అధ్యక్షులు దాసరి శ్రవణ్ ,బీజేవైఎం పట్టణ అధ్యక్షులు బుర్ర రాజు గౌడ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుజరాత్ కు 20 వేల కోట్లు... మరి తెలంగాణకు ఏమిచ్చారు

**హైదరాబాద్, జులై 8:**

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ తెలంగాణ ప్రజల 45 ఏళ్ల కల, డిమాండ్ అని.. తెలంగాణకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ సభలో రాష్ట్ర ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. గుజరాత్ కి 20 వేల కోట్ల లోకోమోటివ్ ఫ్యాక్టరీ ఇచ్చిన ప్రధాని, 520 కోట్ల రైల్వే వ్యాగన్ రిపేర్ షాప్ పెట్టడం రాష్ట్ర ప్రజలను అవమానించడమే అన్నారు. దేశ చరిత్రలోనే అత్యధిక నిరుద్యోగం సృష్టించిన ప్రధాని మోదీ అని, 9 ఏళ్లలో దేశ యువత కోసం చేసిన ఒక్క మంచి పనైనా ప్రధాని చెప్తే బాగుండేదంటూ సెటైర్లు వేశారు.ప్రధాన మంత్రి మోదీ స్పీచ్ మొత్తం అసత్యాలతో కొనసాగిందన్నారు. తెలంగాణకి వచ్చిన ప్రతిసారి కేవలం రాష్ట్ర ప్రభుత్వం పైన అవాకులు చవాకులు పేలడం, అసత్యాలు మాట్లాడడం అలవాటుగా మారిందని కేటీఆర్ అన్నారు. మన రాష్ట్రానికి ఏం చేయగలరో చెప్పకుండా, ఉపన్యాసం ఇచ్చి వెళ్లడం పరిపాటిగా మారిందన్నారు. గత 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసి అన్యాయాన్ని గుర్తుంచుకుని, బీజేపీ నిరంకుశ వైఖరిని గుర్తుంచుకొని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని రాష్ట్రం నుంచి తన్ని తరిమేస్తారని కేటీఆర్ వ్యాఖ్యానించారు .బయ్యారంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయలేదు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసిఐ పునః ప్రారంభం కాలేదు. రాష్ట్రంలోని జాతీయ రహదారి ప్రాజెక్టుల నుంచి మొదలుకొని, నూతన రైల్వే లైన్లు ఏర్పాటు, రైల్వే లైన్ల బలోపేతం వంటి అన్ని రకాల డిమాండ్లను కేంద్రం పక్కనపెట్టడం రాష్ట్రంపై ప్రధానమంత్రి ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు .యువతకు బంగారు కాలం అని చెబుతున్న మోదీ 9 ఏళ్లలో యువతకు చేసిన ఒక్క మంచి పని ఉంటే చెప్పాలన్నారు. దేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం పెరిగిందని ప్రశ్నిస్తే.. పకోడీలు వేసుకోవడం కూడా ఉద్యోగమే అంటూ అవహేళన చేసిన వ్యక్తి ప్రధాన మంత్రి మోదీ అన్నారు కేటీఆర్. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల 20 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయగా.. కేంద్ర ప్రభుత్వం దాదాపు 16 లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను నింపకుండా, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు.

## నూజివీడులో వైఎస్సార్ జయంతి

**నూజివీడు**
దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్.వైస్. రాజశేఖర రెడ్డి 74వ జయంతి వేడుకలను నూజివీడు పట్టణం చిన్నగాంధీబొమ్మవద్ద కేక్ కట్ చేసి,స్వీట్లు పంచి ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే మేకా.వెంకట ప్రతాప్ అప్పారావు.ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ 2014 నుండి అధికారంలో ఉన్న టిడిపి రాష్ట్రానికి నూజివీడు నియోజకవర్గంకి చేసింది రెండు సున్నాలని అభివృద్ధి అంటే 2019 వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి చేసినదని ఆయన అన్నారు.టిడిపి ప్రభుత్వంలో ఎవరికి ఏమి మేలు జరగలేదని వైయస్సార్ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు వెళుతున్నాయని ఆయన అన్నారు.దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల మన్ననలు మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పొందుతున్నారని ప్రజలు కూడా అదే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుర్గమ్మకు శ్రీశైలం సారె

**విజయవాడ**
ఆషాడ మాసం సందర్భంగా దేవస్థానం నందు శ్రీ అమ్మవారికి పవిత్ర సారె సమర్పించు కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ భ్రమరాంభికా మల్లిఖార్జున స్వామి వారి దేవస్థానం, శ్రీశైలం నుండి ఆలయ చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి దంపతులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న దంపతులు మరియు ట్రస్ట్ బోర్డు సభ్యులు అమ్మవారికి ఆషాడ సారె సమర్పించుటకు వచ్చారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు అమ్మవారిని దర్శనం చేసుకొని అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా కార్యనిర్వహణాధికారి గారు శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రము, చిత్రపటం అందజేసినారు. అనంతరం శ్రీశైలం దేవస్థానం తరుపున శ్రీ దుర్గమల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్యనిర్వాహనాధికారి కి శ్రీశైలం దేవస్థానం శేషవస్త్రం, ప్రసాదములు మరియు చిత్రపటము అందజేశారు.

## ఎంపీ ఆదాలకు కనీస అవగాహన లేదు

### నెల్లూరు రురల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి

**నెల్లూరు,**
ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి వి పచ్చి అబద్దాలని నెల్లూరు రురల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. టోల్ ప్లాజా ఏర్పాట్లు ఆపివేశానని ఆదాల చెబుతున్నారు. పది రోజుల నుంచి మమ్మరంగా విజయలక్ష్మి కన్స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. ఎంపీ ఆదాలకు కనీస అవగాహన కూడా ఉండటం లేదు. ఎంపి స్థాయిలో ఉంటే కనీస సమాచారం లేకపోవడం సిగ్గుచేటు. టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తుంటే పోరాటం చేయాల్సిన అవసరం లేదని ఆదాల మీడియాకు చెపుతున్నారు. ఒక ఎంపీగా పెద్దమనిషి స్థాయిలో ఉండి కూడా కనీస సమాచారం లేని ఆదాల వ్యవహార శైలిపై తీవ్రస్థాయిలో నెల్లూరు రురల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి ధ్వజమెత్తారు

## దేశానికి రాహుల్ నాయకత్వం కావాలి

**హైదరాబాద్, జులై 8**
రాహుల్ గాంధీ మనసులో ఇంకా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నందుకు వైఎస్ షర్మిల సంతోషం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోనే దేశం ఉన్నతంగా పురోగమిస్తుందని వైఎస్ నమ్మకమని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెబుతూ షర్మిల రిప్లై ఇచ్చారు. ఈ ట్వీట్‌లో షర్మిల వైఎస్ఆర్ కమిటెడ్ కాంగ్రెస్ లీడర్ అని ..ప్రజల కోసం చనిపోయారన్నారు. రాజశేఖర్ రెడ్డిని .. కమిటెడ్ కాంగ్రెస్ లీడర్ అని చెప్పడం ద్వారా తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేయడానికి షర్మిల రెడీ అవుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ తో విబేధించి సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత ఎప్పుడూ కాంగ్రెస్ నేతలను అభినందించిన దాఖలాలు లేవు.. దాదాపుగా ప్రతి ఏడాది కాంగ్రెస్ నాయకత్వ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి రోజున ఆయనను గుర్తు చేసుకుని నివాళులు అర్పిస్తూనే ఉంటుంది. అయితే వైఎస్ మరణం వెనుక సోనియా గాంధీ ఉందనే ఆరోపణలు కూడా గతంలో జగన్ చేశారు. కానీ ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి మాత్రం.. ఇలాంటి ప్రకటనలు చేయడం లేదు కానీ.. షర్మిల మాత్రం సొంత పార్టీ పెట్టుకుని కాంగ్రెస్ పార్టీకి దగ్గరవుతున్న సూచనలు కనిపిస్తున్నాయంటున్నారు .మామూలుగా షర్మిల పార్టీ విలీనం చర్చలు కొలిక్కి వచ్చాయని.. కానీ షర్మిలను ఏపీ రాజకీయాల్లోకి వెళ్లాలని హైకమాండ్ సూచిస్తోందని చెబుతున్నారు. అయితే షర్మిల మాత్రం తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని పట్టుబడుతున్నారు. కానీ తెలంగాణ సీనియర్ కాంగ్రెస్ నేతలు మాత్రం షర్మిలకు తెలంగాణ రాజకీయాల్లో చోటు లేదని చెబుతున్నారు. ఎమ్మెల్యే సీటు కూడా ఇవ్వరని.. కాంగ్రెస్ పార్టీకి ఏపీలో పునరుజ్జీవం రావాలంటే.. షర్మిల వల్లే సాధ్యమవుతుందని అంటున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన కేవీపీ రామచంద్రరావు కూడా తనకు ఉన్నంత సమాచారం మేరకు.. షర్మిల కాంగ్రెస్ తో చర్చలు జరుపుతున్నారని.. త్వరలో కీలక పరిణామాలు ఉంటాయని చెప్పారు.

**విజయమ్మ భావోద్వేగం**
వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిల ఈ ఉదయం నివాళి అర్పించారు. ఇడుపులపాయలోని తండ్రి సమాధి వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆమె వెంట తల్లి విజయ, కుమారుడు రాజారెడ్డి, ఇతర ఫ్యామిలీ మెంబర్స్ ఉన్నారు.

# బిర్యానీ దుకాణం-ఎమ్మెల్యే వర్సెస్ మేయర్

**విజయవాడ, జూలై 8:**

స్థాయి పెరిగిన చిల్లర డబ్బుల మీద కక్కుర్తి మాత్రం పోదనే విషయం బెజవాడ నాయకుల విషయంలో స్పష్టంగా కనిపిస్తుంది. రోడ్లపై ఫుడ్ కోర్టుల పేరుతో దుకాణాలు ఏర్పాటు చేయించడం, వాటి నుంచి రోజువారీ వసూళ్ళు చేయడం లాభసాటిగా మారడంతో నేతల మధ్య పోటీ పెరిగింది.ఫుడ్ కోర్టులో వసూళ్ల కళ్లు చెదిరేలా ఉండటంతో దుకాణాల ఏర్పాటు విషయంలో అధికార పార్టీ నేతల మధ్య పోటీ నెలకొంది. విజయవాడలో ఈట్ స్ట్రీట్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ప్రదేశంలో దుకాణాలను నిర్వహించే విషయంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి వర్గాలు రోడ్డున పడి కొట్టుకున్నారు.ఫుడ్ కోర్టు వద్ద తోపుడు బండిపై బిర్యానీ దుకాణం ఏర్పాటు చేసే విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం ఏర్పడింది. ఈ ఘటనలో మేయర్ భాగ్యలక్ష్మి అనుచరుడిపై ఎమ్మెల్యే మల్లాది విష్ణు అనుచరులు దాడి చేయడం కలకలం రేపింది.విజయవాడ నగరంలో ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు పేరుతో ఏర్పాటు చేసిన 'ఈట్ స్ట్రీట్' లో వైసీపీ నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఆహ్లాదకరంగా ఉండాల్సిన ఈ ప్రాంతంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దుకాణాలు పెట్టేందుకు స్థానిక నేతలకు రోజువారీ అద్దెలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఫుడ్ కోర్టులో కేటాయించిన దుకాణాల్లో అనేక అవకతవకాలు జరిగాయని గతంలో ఆరోపణలు వచ్చాయి. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కనుసన్నల్లోనే దుకాణాలు ఏర్పాటు చేయాలనే రూల్ అమలు చేయడంపై మిగిలిన నేతలు గుర్రుగా ఉన్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి మేయర్ భాగ్యలక్ష్మి చెప్పారని నూతనంగా ఓ బిర్యానీ బండిని పెట్టించేందుకు ఇద్దరు వీఎంసీ ఉద్యోగులను ఫుడ్ కోర్టుకు పంపించారు.బండి ఏర్పాటు చేస్తున్న సమయంలో ఎమ్మెల్యే విష్ణు అనుచరులు వచ్చి వీఎంసీ ఉద్యోగులను నిలదీశారు. ఫుడ్ కోర్టులో బండి పెట్టాలంటే ఎమ్మెల్యే అనుమతి కావాలని మేయర్ ఎవరు చెప్పడానికి అని వాగ్వాదానికి దిగారు. వీఎంసీ ఉద్యోగులతో పాటు బండి పెట్టేందుకు వచ్చిన వ్యక్తిపై దాడి చేశారు. మేయర్ పంపారని చెప్పినా ఎమ్మెల్యే అనుచరులు వారిపై దాడి చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఫుడ్కోర్టులో బండ్లు ఎలా పెడతారో చూస్తామంటూ పరస్పరం హెచ్చరికలు చేసుకున్నారు. ఈ ఘటనలో మాచవరం పోలీసుల నిర్లక్ష్యం కూడా స్పష్టంగా ఉందని తెలుస్తోంది. తరచూ గొడవలు జరుగుతున్నా వాటిని నియంత్రించడంలో మాత్రం విఫలం అవుతున్నారు.2015లో విజయవాడ పోలీస్ కమిషనర్గా ఏబీ వెంకటేశ్వరరావు ఉన్నసమయంలో రాత్రి పూట అందరికి ఆహారం అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఫుడ్ కోర్టుల్ని ప్రారంభించారు. మొదట్లో పూర్తిగా పోలీస్ శాఖ పర్యవేక్షణలో ఫుడ్ కోర్టు సాగేది. రాత్రి సమయంలో తిరిగే వారిని గుర్తించడం, నేరస్తుల సమాచారాన్ని తెలుసుకునే లక్ష్యాలతో నగరంలో వీటిని ఏర్పాటు చేశారు.మొదట్లో ఫుడ్ కోర్టులను పోలీసులు సమర్థంగా వ్యవహరించినా తర్వాత వాటిని రాజకీయ నేతల చేతుల్లోకి వదిలేశారు. వాటిలో వచ్చే చిల్లర డబ్బులు ఏరుకోడానికి అలవాటు పడిన నాయకులు నగరంలో ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై వ్యాపారాలు చేయించి రోజువారీ అద్దెలు వసూలు చేయించడం మొదలు పెట్టారు. నగరంలో అత్యధికంగా ఒక్క ఎమ్మెల్యేకే ఈ తరహా ఆదాయం సమకూరడం వైసీపీలో మిగిలిన వారికి కంటగింపుగా మారింది.

# ఘనంగా వైఎస్సార్ జయంతి

**గోకవరం**

తూర్పుగోదావరి జిల్లా గోకవరం దివంగత నేత, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 74వ జయంతి వేడుకలు వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోకవరం పాత బస్టాండ్ సమీపంలో ఉన్న దివంగత రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి వైఎస్ఆర్సిపి పార్టీ కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు దివంగనేత వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమలు నిర్వహించారు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు సుంకర శ్రీవల్లి దివంగత నేత రాజశేఖర్ రెడ్డిని స్మరించుకుంటూ వృద్ధులకు స్వీట్లు దుప్పట్లు అందజేశారు ఈసందర్భంగా..ఉభయగోదావరిజిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్చార్జి గుల్ల ఏడుకొండలు మీడియాతో మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు ఆయన లేని లోటుని తన తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తూ రాష్ట్రంలో రైతులకు అండగా ఉంటూ ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తున్నారని కొనియాడారుఈ కార్యక్రమంలో... జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్,ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, కర్రీ సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు, నరాశెట్టి నరసయ్య, చింతల అనీలు, ఐజిన్న,కిరణ్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

# ఆరోగ్యశ్రీని తెచ్చిన వైఎస్సార్

**రామచంద్రాపురం**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి 74వ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర మంత్రి చెల్లుబోయన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి చెల్లుబోయన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ దేశంలో అనేక మంది రాజకీయ నాయకులు వారి ప్రజాప్రస్థానం మొదలైనప్పటికీ వారు ప్రజల కష్టాలను తెలుసుకోలేకపోయారన్నారు. ప్రాణాలకు తెగించి పాదయాత్ర చేసి .,పేదవాడు ఏ సందర్భంలో మరింత పేదవాడు అవుతాడో గమనించిన మొట్టమొదటి నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని అన్నారు.పేదవాడికి జబ్బు చేసినప్పుడు డబ్బు లేక., మరింత పేదవాడు అయిపోతాడనీ గమనించిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ తీసుకొచ్చారన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైసిపి నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ముందస్తు లోకసభ ఎన్నికలు ?

**న్యూఢిల్లీ, జూలై 8 :**

పార్లమెంట్కు ముందస్తు ఎన్నికలు వస్తాయని మళ్లీ విస్తృతమైన చర్చ ప్రారంభమయింది. వచ్చే నవంబర్, డిసెంబర్లోనే ఎన్నికలు నిర్వహించేందుకు బీజేపీ కసరత్తు చేస్తోందని ఢిల్లీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీజేపీని ప్రక్షాళన చేయడం, కేంద్ర మంత్రి వర్గ విస్తరణను చేయనుండటం మాత్రమే ఎన్డీఏను కూడా బలోపేతం చేయడానికి ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారు. కొత్త పార్టీలను చేర్చుకుంటున్నారు. అందుకే మందస్తుకు మోదీ కూడా రెడీ అయ్యారా అన్న అనుమానాలు రాజకీయవర్గాల్లో ప్రారంభమయ్యాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్ గఢ్, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీలకు డిసెంబర్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ఒక్క రాజస్థాన్ లో మాత్రమే బీజేపీ పరిస్థితి మెరుగ్గా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఈ రాష్ట్రాల్లో ఫలితాలు వచ్చిన తర్వాత మూడు నెలల వ్యవధిలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికల తొలి విడత పోలింగ్ మార్చిమొదటి వారంలోనే ఉంటుంది. ఆయా రాష్ట్రాల్లో వ్యతిరేక ఫలితాలు వస్తే.. సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం పడుతుందేమోనన్న ఆందోళన బీజేపీ వర్గాల్లో ఉంది. కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితాల తర్వాత మోదీ అజేయుడు కాదన్న అభిప్రాయాన్ని విపక్ష పార్టీలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఏడాది చివరిలో జరగనున్న రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోతే? మోదీ మానియా అనేది అసలు లేదన్న అభిప్రాయం అంతటా వ్యాపిస్తుంది. మధ్యప్రదేశ్, చత్తీస్ ఘఢ్, రాజస్థాన్లలో కాంగ్రెస్తో బీజేపీ ముఖాముఖి పోరాడుతోంది. తెలంగాణలో త్రిముఖ పోటీ ఉంది. కానీ అక్కడ ఇటీవల పరిణామాలు బీజేపీకి ఇబ్బందికరంగా మారాయి. ముఖాముఖి పోరులో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే? ఆ పార్టీ అనూహ్యంగా పుంజుకుంటుంది. ఇప్పటికే కర్ణాటక ఇచ్చిన ఊపు ఉంది. ఇది బీజేపీకి ఇబ్బందికర పరిణామమే. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలు కూడా బలం పెంచుకుంటున్నాయి. దక్షిణాదిలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలే కీలకంగా ఉన్నాయి. ఈ పార్టీలన్నీ సంప్రదాయంగా బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఓ వైపు కాంగ్రెస్ పుంజుకుని.. ఈ ప్రాంతీయ పార్టీలు కూడా.. అండగా నిలిస్తే.. బీజేపీకి ఇబ్బందికర పరిణామమే. పైగా ఇటీవల ప్రాంతీయ పార్టీలన్నీ కూటమిగా మారుతున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఇప్పటి వరకు ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను అంచనా వేసుకుని.. సిద్ధాంతాల ప్రాతిపదికగా అందరూ ఒకే వేదికపైకి రావడానికి కొంత సమయం పడుతుంది. పట్నాలో ఓ సమావేశం అయింది. బెంగళూరులో రెండో సమావేశం కోసం ప్రయత్నిస్తున్నారు. విపక్ష పార్టీలన్నీ ఓ కూటమిగా మారే ప్రయత్నాల్లోఉండగానే.. ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన బీజేపీ చేస్తున్నట్లు సమాచారం. అలా చేయడం వల్ల ఎవరికి వారు పోటీ చేసి.. ఓట్లు చీలిపోయి.. లాభం పొందుతామని బీజేపీ భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీని ఇప్పుడు నిధుల సమస్య పట్టి పీడిస్తోంది. కాంగ్రెస్ పార్టీ రేసులోకి వచ్చినట్లు అనిపిస్తే.. ఆ పార్టీకి విరాళాలు వస్తాయి. ఇది బీజేపీకి చిక్కులు తెచ్చి పెట్టే అంశమే. అందుకే.. ఎన్నికల ఖర్చులు తగ్గించడానికి జమిలీ ఎన్నికలకు వెళు_న్నామని.. ఆ దిశగా తొలి అడుగు వేస్తున్నామని బీజేపీ చెప్పుకునే అవకాశం ఉంది. ఈ దిశగా కేంద్రం ప్రయత్నిస్తుందా లేదా అన్నది మాత్రం ఓ వారం రోజుల్లో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# వరంగల్ సాక్షిగా కేసీఆర్ పై యుద్ధం

**వరంగల్, జూలై 8:**

వరంగల్ సభ సాక్షిగా కేసీఆర్పై యుద్ధం ప్రకటిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ దేశంలో భవిష్యత్ లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. మోదీ పర్యటనను అధికార పార్టీ ఎందుకు బహిష్కరించిందో చెప్పాలన్నారు. వరంగల్లో 3000 మందికిపైగా ఉద్యోగాలు వస్తాయి... రైల్వే మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ పెడుతుంటే... దానికి వ్యతిరేకంగా బాయ్ కాట్ చేశారా అని సమాధానం చెప్పాలి. జాతీయ రహదారుల ద్వారా తెలంగాణ అభివృద్ధి కోసం ప్రారంభోత్సాలు చేయడానికి వస్తే బాయ్కాట్ చేశారా అని ప్రశ్నించారు. ఆరువేల కోట్లతో రామగుండంలో ఎరువుల ఫ్యాక్టరీ పెట్టినందుకు బహిష్కరిస్తున్నారా అని క్వశ్చన్ చేశారు. హైదరాబాద్ నుంచి రెండు వందేభారత్ ట్రైన్లు ప్రారంభించడానికి వస్తే బహిష్కరిస్తున్నారా అని చెప్పాలి. ఈ రాష్ట్రంలో ఎవరినైనా బాయకాట్ చేయాలంటే ముందుగా కల్వకుంట్ల కుటుంబాన్ని బాయ్కాట్ చేయాలన్నారు. ఈ రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానన్న వ్యక్తి దళితులకు మోసం చేసినందుకు బాయ్కాట్ చేయాలి. మూడు ఎకరాల స్థలం ఇవ్వకుండా మోసం చేసినందుకు దళిత సమాజం కేసీఆర్ బాయ్కాట్ చేయనుంది. నిరుద్యోగ భృతిని ఇవ్వనందుకు తెలంగాణ యువత, నిరుద్యోగులు బహిష్కరించనున్నారు. పేపర్ లీక్ చేసిన మీ చేతకాని తనం వల్ల నిరుద్యోగ యువత జీవితాలతో ఆడుకున్నారు. మజ్లిస్ సంస్థలను పెంచి పోషించినందుకు తెలంగాణ సమాజం బహిష్కరించనున్నారు. ఎరువులు ఫ్రీగా ఇస్తామన్నారు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులు అప్పులు మాఫీ చేస్తామని చేయనందుకు మిమ్మల్ని బాయకాట్ చేస్తుంది. నిన్ను నీ కుటుంబాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించి ఫామ్హౌస్కే పరిమితం చేయబోతున్నారు. మా పోరాటం కొనసాగుతుంది. ఇంకా ఏమన్నారంటే... చాలా మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రచారం చేస్తున్నారు. ఈ రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లో గెలిచిన చరిత్ర ఉంది. ఏ రోజు కూడా కాంగ్రెస్తోకానీ, బీఆర్ఎస్తో కానీ బీజేపీ కలవదు, ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా కొనసాగిస్తుంది. ఈ రెండు కుటుంబ పార్టీలు, అవినీతి పార్టీలు, డీఎన్ఏ ఒక్కటే. ఈ రెండు పార్టీలు తెలంగాణ నుంచే కాదు యావత్ దేశంలో భవిష్యత్ ఉండకూడదు. కాంగ్రెస్కు ఓటేసినా, బీఆర్ఎస్కు ఓటేసినా తెలంగాణకు అన్యాయం చేసినట్టే. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ పార్టీలు కూడా ఎంఐఎంను పెంచి పోషించిన పార్టీలు. సలాం చేసిన పార్టీలు. కచ్చితంగా రానున్న రోజుల్లో ఓడించాల్సిన అవసరం ఉంది. మతోన్మాదాన్ని, రౌడీయిజాన్ని పెంచిపోషించిన ఈ పార్టీలను ఓడించాలి. బీఆర్ఎస్ పోవాలి, బీజేపీ రావాలని తెలంగాణ సమాజం కోరుకుంటుంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవకపోతే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. సంక్షేమ పథకాలు కొనసాగించే పరిస్థితి లేదు. మేం కచ్చితంగా కల్వకుంట్ల కుటుంబానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తాం. కేసీఆర్ కుటుంబాన్ని ఫామ్హౌస్కే పరిమితం చేస్తాం అని కిషన్ రెడ్డి అన్నారు.

# త్వరలో టెట్ నోటిఫికేషన్

**హైదరాబాద్, జూలై 8 :**



త్వరలో టెట్ నోటిఫికేషన్ రాబోతుంది. ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. తెలంగాణలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నడుస్తోంది. అయితే డీఎస్సీపై ఇప్పటి వరకు మాత్రం ఎలాంటి అప్డేట్ లేదు. గతేడాది టెట్ పరీక్ష నిర్వహించిన విద్యాశాఖ... వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందని అంతా భావించారు. కానీ ఇప్పటి వరకు ప్రకటన జారీ కాలేదు. ఇప్పటికే టెట్ పరీక్ష నిర్వహించి... ఏడాది పూర్తి అయింది. ఈ నేపథ్యంలో మరోసారి టెట్ నోటిఫికేషన్ ఇస్తారా...? నేరుగా డీఎస్సీనే నిర్వహిస్తారా అన్న చర్చ జరుగుతుంది. ఈ క్రమంలో తెలంగాణ మంత్రివర్గ ఉప సంఘం కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నిర్వహించాలని మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయించింది. ఫలితంగా మరోసారి టెట్ కోసం ఎదురుచూస్తున్న వారికి తీపి కబురు చెప్పినట్లు అయింది. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రకటన వచ్చే అవకాశం ఉంది.రాష్ట్ర ఏర్పాటు తర్వాత 2016 మే 22, 2017 జులై 23, 2022 జూన్ 12న టెట్ పరీక్షలు నిర్వహించారు. మరో నెలలో ఏడాది గడుస్తున్నందున మళ్లీ టెట్ జరపాల్సి ఉంటుంది. ఏడాది కాలంలో డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణులైన వారు 20వేలకు పైగా ఉంటుంది. గత కొంతకాలంగా మరో టెట్ నిర్వహించిన తర్వాతే డీఎస్సీ పరీక్షను జరపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈసారి నిర్వహించబోయే పరీక్షకు కూడా దాదాపు 3 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది.ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం డీఎడ్, బీఎడ్ పాసైన వారు టెట్లో ఉత్తీర్ణులైతేనే ఉపాధ్యాయుల నియామకానికి నిర్వహించే టీఆర్టీ పరీక్ష రాయడానికి అర్హులవుతారు. టెట్లో వచ్చిన మార్కులకు టీఆర్టీ ర్యాంకింగ్లో 20 శాతం వెయిటేజీ ఉన్నందున టెట్లో అత్యధిక మార్కులు దక్కించుకోవడానికి అభ్యర్థులు పోటీపడుతుంటారు. టెట్ లో అర్హత లేకపోతే ఈ పరీక్షలకు హాజరుకాలేరు.పైగా టెట్ ఉత్తీర్ణత లేకపోతే ప్రైవేటు పాఠశాలల్లో కూడా బోధన చేయడానికి వీలుండదు.రాష్ట్రంలో స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులు 13 వేల వరకు ఖాళీగా ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. విద్యాశాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలతో పాటు టీచర్ పోస్టుల భర్తీ, మన ఊరు-మన బడి పురోగతిపై చర్చించేందుకు మంత్రి వర్గ ఉపసంఘం శుక్రవారం భేటీ అయింది. విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్యక్షతన హైదరాబాద్లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన ఈ సమావేశానికి మంత్రులు హరీశ్రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్రెడ్డి, జగదీశ్రెడ్డి సహా విద్యాశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. వివిధ అంశాలపై చర్చించిన మంత్రి వర్గ ఉప సంఘం మరోసారి భేటీ కావాలని నిర్ణయించింది.తెలంగాణలోని డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఖాళీల భర్తీకి జులై 6న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 2,858 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనున్నారు. వీటిలో కాంట్రాక్ట్ పద్ధతిలో 527 మంది లెక్చరర్ పోస్టులను, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 341 పోస్టులను, హానరేరియం కింద 50 టీఎస్కేసీ ఫుల్ టైమ్ మెంటర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అదేవిధంగా 1,940 గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులను కూడా భర్తీ చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఈ పోస్టుల కాలపరిమితి వచ్చే ఏడాది మార్చి 31తో ముగియనుందిటీచర్ల హేతుబద్ధీకరణ నేపథ్యంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దాదాపు 15 వేల వరకు టీచర్ ఉద్యోగాలకు సంబంధించి టీఆర్టీ నోటిఫికేషన్ రావొచ్చు. అయితే దీనిపై ఇప్పటికే పలుమార్లు ప్రకటనలు వచ్చినప్పటికీ? నోటిఫికేషన్లు జారీ కాలేదు. నిరుద్యోగులు కూడా భారీ సంఖ్యలో టీఆర్టీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు.

# సైకో పాలన పోవాలి సైకిల్ పాలన రావాలి

**నందికొట్కూర్**

పరిపాలన చేతకాని వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గంటే పోగు జయాకర్ ఓ ప్రకటనలో అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజల్లో వైసిపి ప్రభుత్వం పై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతకు సీఎం జగన్మోహన్ రెడ్డి భయాందోళనకు గురై ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని ఢిల్లీ పెద్దలను వేడుకుంటున్నారని ఆరోపించారు.ఒక పక్క కేసులు, మరోపక్క అప్పులు ఇచ్చిన హామీలను అమలు చేయక బటన్ నొక్కిన రెండు వారాలైన అమ్మ ఒడి డబ్బులు రాలేదు. మద్యం నిషేధ పాలసీ తీసుకువస్తారని విడతలవారీగా ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఈ మద్యం లేకుంటే ప్రభుత్వం నడవలేని పరిస్థితిలో ఈ జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. కరెంటు చార్జీలు విపరీతంగాపెంచడంతోపాటు ప్రజలకు10 రూపాయలు ఇచ్చి 100 రూపాయలు లాగుతున్నారు. 4 సంవత్సరాలు ఈ ప్రభుత్వాన్ని నమ్ముకుని ఇంకా నావల్ల కాదు. మహాప్రభో అన్నట్లుంది. ముందస్తు ఎన్నికలకు జగన్ వెళతారని స్వయానా జగన్ అనుకూల పత్రికలు మీడియా ఛానల్స్ చెబుతున్నాయి. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు. అధికారం ఇచ్చినందుకు ప్రజలు మండిపడుతున్నారు. వైసీపీ అధికారం చేపట్టాక దళితులపై దాడులు పెరిగాయని,దళితులకు అందాల్సిన పథకాలను పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి బుద్ధి చెబుతున్నారు.

# 3 నెలలె ముందుగానే జాబితాలు

**హైదరాబాద్, జూలై 8 :**

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. చివరి వరకూ కాకుండా ఈసారి ముందుగానే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గాల వారీగా భట్టి నుంచి నివేదిక కోరినట్లు సమాచారం. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలను అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర సక్సెస్ అవ్వడంతో రాహుల్ కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఖమ్మం సభ తరువాత గన్నవరం బయల్దేరిన రాహుల్ తనతో పాటుగా భట్టిని కారులో వెంట బెట్టుకెళ్లారు. ఆ సమయంలో రాష్ట్రంలో పార్టీ పరిస్థితులపైన ఆరా తీసినట్లు సమాచారం. నేతల సమన్వయంపైనా భట్టితో చర్చించారు. రాహుల్ గాంధీ స్వయంగా తెలంగాణలో కాంగ్రెస్ పరిణామాలపై ఆరా తీస్తున్నారు. కర్ణాటక తరువాత తెలంగాణలో అధికారం దక్కించుకోవాలనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తుంది. ఈ సమయంలో ఎక్కడా ఏ విషయంలోనూ ఉపేక్షించకూడదని రాహుల్ నిర్ణయించినట్లు కనిపిస్తోంది. పీపుల్స్ మార్చ్ యాత్ర ద్వారా భట్టి పడ్డ కష్టాన్ని రాహుల్ గుర్తించారు. తన సుదీర్ఘ యాత్ర ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపటంతో పాటుగా పేదల వద్దకు పార్టీని తీసుకు వెళ్లటం, వారి సమస్యల పట్ల స్పందించటం పార్టీకి సానుకూలంగా మారిందని అధిష్ఠానం విశ్వసించినట్లు తెలుస్తోంది. ఖమ్మం సభ ముగిసిన తరువాత భట్టిని తనతో పాటుగా తీసుకెళ్లిన రాహల్ కీలక మంతనాలు చేసినట్లు సమాచారం.రాహుల్ కారులోనే భట్టికి పార్టీ వ్యూహాలపైన కీలక సూచనలు చేశారని తెలుస్తోంది. ఎన్నికల మేనిఫెస్టో, అభ్యర్థుల ఎంపిక కీలకం కావటంతో వీటి పైన భట్టి అభిప్రాయాలను కోరినట్లు సమాచారం. పార్టీలో నెలకొన్న పరిస్థితులను వివరించిన భట్టి విక్రమార్క.. టికెట్ల ఖరారు పైన తన అభిప్రాయాలను వివరించారని తెలుస్తోంది. నియోజకవర్గాల వారీగా..సామాజిక వర్గాల సమీకరణాలు దెబ్బతినకుండా పూర్తి అంచనాలతో నివేదిక కోరినట్లు సమాచారం. అభ్యర్థి ఎవరైనా గెలుపే ప్రామాణికం కావాలని భట్టి, రాహుల్ మంతనాల్లో నిర్ణయించారు. మొత్తం నియోజకవర్గాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిస్థితులు..అభ్యర్థుల ఎంపికలో ఆయా నియోజకవర్గాల్లో తీసుకోవాల్సిన అంశాల పైన నివేదిక కోరినట్లు సమాచారం. దీంతో, భట్టికి రాహుల్ కీలక బాధ్యతలు అప్పగించినట్లైంది.ఎన్నికల సమయంలో చివరి నిమిషంలో టికెట్లు ఖరారు చేయటంతో ప్రతీ సారి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సారి ఎన్నికలకు ముందుగానే క్లారిటీ ఉన్న నియోజకవర్గాల్లో వచ్చే నెలలోనే టికెట్లు ఖరారు చేసే ఆలోచనలో పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. పోటీ ఉన్న నియోజకవర్గాల్లోనూ అన్ని సమీకరణాలను పరిగణలోకి తీసుకొని ఎన్నికలకు మూడు నెలల ముందుగానే టికెట్లు ఖరారు చేసేందుకు రాహుల్ గాంధీ నిర్ణయించినట్లు పార్టీ వర్గాల సమాచారం. దీని ద్వారా చివరి నిమిషంలో సీట్ల కోసం వివాదాలు నివారించవచ్చని, అభ్యర్థుల ప్రచారానికి సమయం ఎక్కువగా ఇచ్చినట్లవుతుందని భావిస్తున్నారు. ఈ సమయంలో భట్టి నుంచి రాహుల్ నివేదిక కోరటంతో అభ్యర్థుల ఎంపికలో భట్టి విక్రమార్క చేసే సూచనలు, ఇచ్చే నివేదిక పార్టీ అభ్యర్థుల ఖరారులో కీలకంగా మారనుందని సమాచారం.

# కమాన్ పూర్ లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**కమాన్ పూర్**

కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వైనాల రాజు ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను కమాన్ పూర్ మండల వ్యవసాయ సహకార సంఘం ఆఫీసు నుండి మండల కేంద్రం బస్టాండ్ అంబేద్కర్ బొమ్మ వద్ద వరకు శవ యాత్ర చేసి అంబేద్కర్ బొమ్మ వద్ద నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వైనాల రాజు మాట్లాడుతూపార్లమెంటులో బావి రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీల చీకటి ఒప్పందాన్ని బయటకు తెచ్చి పార్లమెంటులో కార్పొరేట్ వ్యవస్థకు దేశాన్ని తాక టు పెట్టద్దు అని దేశ సమైక్యతను విచ్ఛిన్నం చేయద్దని కుల మతాల మధ్య చిచ్చుపెట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులపై గలవెత్తిన నాయకుడు రాహుల్ గాంధీ అటువంటి నాయకుడు పార్లమెంటులో గొంతు విప్పద్దని కక్షపూరితంగా కార్పొరేట్ ప్రభుత్వమైనటువంటి బిజెపి ప్రభుత్వం నరేంద్ర మోడీ కను సైగల్లో రాహుల్ గాంధీ సభ్యత్వాన్ని రద్దు చేయడం జరిగింది .అంతేకాకుండా వారు అధికారికంగా నివసిస్తున్నటువంటి ఇల్లును తొలగించడం జరిగింది అదేవిధంగా ఎట్టి పరిస్థితిలో రాహుల్ గాంధీ ని ఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రధానమంత్రి పదవిని అడ్డుకోవాలని ఉద్దేశంతోటి ఆరు సంవత్సరాలు ఎటువంటి ఎన్నికల్లో పోటీ చేయకుండా వారి పై ఏకగ్రీవ తీర్మానం చేసి పార్లమెంటులో బిల్లు పెట్టించడం జరిగింది. ఇవి చాలవు అన్నట్టు గుజరాత్ హైకోర్టు ఇచ్చినటువంటి తీర్పు వెనక మాఫియాశక్తి కార్పొరేట్ శక్తులైనటువంటి అదా అని నరేంద్ర మోడీ ప్రోత్సాహం తోటి హైకోర్టులో అభ్యర్థనను కొట్టివేయడం జరిగింది వీటన్నింటి వెనక కార్పొరేట్ శక్తులైనటువంటి అదాని నరేంద్ర మోడీల కుయుక్తులు పూర్తిస్థాయిలో దేశ ప్రజలందరికీ తెలుసు దేశ సమైక్యత కోసం నాలుగు వేల కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసినటువంటి నాయకుని ఈ దేశంలో ఎక్కడా పోటీ చేయకుండా చేయాలనే కుట్ర అదేవిధంగా చట్టాన్ని అడ్డం పెట్టుకొని న్యాయస్థానాలను కూడా బ్లాక్ మెయిల్ చేస్తున్నటువంటి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను శవయాత్ర చేసి అంబేద్కర్ సర్కిల్లో దహనం చేశారు.

# కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి

**హైదరాబాద్, జూలై 8:**



ఎప్పటి నుంచో వేచి చూస్తున్న నిర్మాణానికి తాజాగా కేంద్ర సర్కారు ఆమోదించింది. ఇరు తెలుగు రాష్ట్రాలను కలిపి నిర్మించాలనుకున్న వంతెన నిర్మాణానికి కేంద్రం అనుమతించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య సోమశిల వద్ద కృష్ణా నదిపై తీగల వంతెన (ఐకానిక్ హైబ్రిడ్ కేబుల్ బ్రిడ్జి ) నిర్మాణానికి కేంద్రం ఆమోదముద్ర వేసింది. జాతీయ రహదారుల సంస్థ రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్- డీపీఆర్ ను కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా ఆమోదం తెలిపింది.ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు రూ.1,519.47 కోట్లు ఖర్చు చేయాలని కేంద్ర సర్కారు నిర్ణయం తీసుకుంది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1,082.56 కోట్లు, పర్యాటక అభివృద్ధి పనులకు మరో రూ.436.91 కోట్లు కేటాయిస్తూ నిర్ణయాన్ని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని కల్వకుర్తి నుంచి సోమశిల వరకు మొత్తంగా 79.3 కిలో మీటర్ల మేర రెండు వరుసల రహదారి నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.886.69 కోట్లు కేటాయించింది. దీనిపై కాంట్రాక్టర్లతో రోడ్లు భవనాల శాఖ ఇప్పటికే ఒప్పందం చేసుకుంది. ఈ ఐకానిక్ హైబ్రిడ్ కేబుల్ బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు.కృష్ణా నదిపై తెలంగాణలోని సోమశిల, ఆంధ్రప్రదేశ్ లోని సిద్ధేశ్వరం గుట్టల మధ్య 1.08 కిలో మీటర్ల మేరకు ఈ ఐకానిక్ హైబ్రిడ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించనున్నారు. దేశంలో ఇప్పటికే ఉన్న తీగల వంతెనల కన్నా మెరుగ్గా ఈ కేబుల్ బ్రిడ్జీని నిర్మించేందుకు పలు నమూనాలను కేంద్రం పరిశీలించింది. అందులో నుంచి ఒకదాన్ని ఎంచుకుని ఆ తరహాలో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోదం ఇచ్చింది. ఈ మార్గానికి ఇప్పటికే జాతీయ రహదారి నంబర్ కేటాయించింది కూడా. పనుల పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేసింది కేంద్ర సర్కారు. వంతెన నిర్మాణ పనులను జాతీయ రహదారుల సంస్థ చూసుకుంటుంది. టెండర్లు ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా కేంద్ర మంత్రిత్వ శాఖ అధికారులకు సంస్థ ఆదేశాలు పంపినట్లు తెలుస్తోంది. వంతెన నిర్మాణంతో రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు మరింత సులువైన మార్గం ఏర్పడటంతో పాటు తెలంగాణ నుంచి తిరుపతికి కనీసం 70-80 కిలో మీటర్ల మేర దూరం తగ్గే అవకాశం ఉంది. చుట్టూ విశాలమైన శ్రీశైలం జలాశయం, నల్లమల అడవి, ఎత్తైన పర్వతాల మధ్య నిర్మించే ఈ వంతెన పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుందని తెలిపారు. తెలంగాణ వైపున లలితాసోమేశ్వర ఆలయం, ఆంధ్రప్రదేశ్ వైపున సంగమేశ్వర ఆలయాన్ని చూడటానికి ఇదో కేంద్రంగా మారుతుందని అన్నారు. కృష్ణానదిపై నిర్మించే వంతెనపై పాదచారులు నడిచేందుకు పొడవైన గ్లాస్ వాక్‌వే కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. గ్లాస్ వాక్ వేతో నిర్మితం కానుండటంతో పర్యాటకంగా ఈ మార్గం టూరిస్ట్ డెస్టినేషన్ అవుతుందని అధికారులు అంటున్నారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు పనులు అతి త్వరలోనే ప్రారంభం అవుతాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి

# తగ్గనున్న వందే భారత్ టిక్కెట్లు

**చెన్నై, జూలై 8 :**

రైల్వే బోర్డ్ ప్రయాణికులకు తీపి కబురు చెప్పింది. వందేభారత్‌తో పాటు అన్ని ంఅ చైర్ కార్, ఎగ్జిక్యూటివ్ క్లాస్ రైళ్ల టికెట్ ధరల్ని తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. 25% మేర తగ్గిస్తున్నట్టు వెల్లడించింది. గత నెల రోజులుగా ఈ రైళ్లలో ఆక్యుపెన్సీ 50% కన్నా తక్కువకు పడిపోయింది. అందుకే...ఈ నిర్ణయం తీసుకున్నట్టు రైల్వే బోర్డ్ తెలిపింది. ఈ రైళ్ల వినియోగం మరింత పెంచేందుకు టికెట్ ధరల్ని తగ్గించినట్టు వివరించింది. ఈ ధరలు తగ్గించే అధికారం జోనల్ రైల్వేస్‌కే అప్పగించింది రైల్వే శాఖ. అయితే..బేసిక్ ఫేర్‌పైనే ఈ 25% తగ్గింపు ఉంటుంది. మిగతా ఛార్జీలు..అంటే రిజర్వేషన్ ఛార్జ్‌లు, సూపర్ ఫాస్ట్ సర్‌ఛార్జ్, ఊు ఛార్జీల్లో మాత్రం ఎలాంటి మార్పులేదు. ఈ తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తుందని రైల్వే ప్రకటించింది. ఈ తగ్గింపు కేవలం ఏసీ చైర్ కార్‌లు, ఎగ్జిక్యూటివ్ క్లాస్ ట్రైన్‌లకు మాత్రమే వర్తిస్తుంది. టికెట్ బేస్ ఫేర్‌పై 25% తగ్గింపు లభిస్తుంది. ఇక్కడ కీలక విషయం ఏంటంటే...గత నెల రోజుల్లో 50% తక్కువ ఆక్యుపెన్సీ నమోదైన రైళ్లలో మాత్రమే ఇది వర్తిస్తుంది. ఎండ్ టు ఎండ్ జర్నీకే కాకుండా మధ్య స్టేషన్‌లలో దిగిపోయే వారు కూడా 25% తగ్గింపుతో టికెట్‌లు కొనుగోలు చేసుకోవచ్చు. దాదాపు ఆర్నెల్ల పాటు ఈ స్కీమ్ కొనసాగే అవకాశాలున్నాయి. ఆ తరవాత డిమాండ్ ఆధారంగా ఈ తగ్గింపుని అమలు చేస్తూ ఉంటారని కొందరు అధికారులు వెల్లడించారు. వీకెండ్స్‌లో లేదా వీక్‌డేస్‌లో టికెట్ ధరలు తగ్గించి ఎక్కువ మంది ప్రయాణికులు సర్వీస్‌లు పొందే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఆక్యుపెన్సీని గమనించిన తరవాతే ఈ స్కీమ్‌ని కంటిన్యూ చేయాలా..లేదా ఆపేయాలా అన్నది రైల్వేబోర్డు నిర్ణయం తీసుకుంటుంది. ఆక్యుపెన్సీ ఊహించిన దానికంటే ఎక్కువగా పెరిగితే అప్పుడు ఈ స్కీమ్‌ని ఎత్తేసే అవకాశముంది. స్పెషల్ ట్రైన్‌లలో మాత్రం ఈ స్కీమ్ వర్తించదు. ఇటీవల ప్రారంభించిన నాలుగు వందేభారత్ రూట్లలో తక్కువ ఆక్యుపెన్సీ ఉంది. ఇండోర్ - భోపాల్, మడ్‌గోన్ - ముంబయి, జబల్‌పూర్ - భోపాల్ రూట్లలో మరీ తక్కువగా 21 శాతం నుంచి 55 శాతం వరకు ఆక్యుపెన్సీ ఉంది. జూన్ నెలకు సంబంధించి ఆయా రైళ్ల ఆక్యుపెన్సీని పరిశీలిస్తే.. భోపాల్- ఇండోర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కేవలం 29 శాతం, ఇండోర్- భోపాల్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళు కేవలం 21 శాతం ఆక్యుపెన్సీని మాత్రమే నమోదు చేశాయి. భోపాల్- జబల్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రూటులో 32 శాతం ఆక్యుపెన్సీ ఉంది. జబల్‌పూర్- భోపాల్ వందే భారత్ ఆక్యుపెన్సీ రేషియో 36శాతంగా ఉంది. దేశంలో చాలా వందే భారత్ రైళ్లు 100శాతం ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని, కొన్ని మాత్రమే తక్కువ ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ముఖ్యంగా తక్కువ ప్రయాణ సమయం ఉన్న రైళ్లలో టికెట్ ధరలు తగ్గిస్తే మరింత ఆదరణ సొంతం చేసుకుంటాయని అభిప్రాయపడ్డారు.

# రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలే కీలకం

**-బీసీ బందు పై కసరత్తు ప్రారంభించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం**

**-హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్లాన్..!**

**హైదరాబాద్**

బీసీ బంధుపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. బీసీల ఓట్లు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కీలకం కానుండటంతో వారిని ఆకట్టుకునేందుకు ప్లాన్ చేస్తుంది. రాబోయే ఎన్నికల్లో ఎన్నికల అస్త్రంగా ఉపయోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు బీసీలను దూరం చేయాలంటే ఇదొకటే మార్గమని భావిస్తున్నారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికలు అన్నిపార్టీలకు కీలకం కానున్నాయి. విపక్షాలు ఉనికి కోసం, అధికారంకోసం సర్వశక్తులు ఒడ్డేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. బీఆర్‌ఎస్ సైతం మూడోసారి అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతుంది. ఇప్పటికే గులాబీ బాస్ దూకుడు పెంచారు. పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా బీసీలను ఆకట్టుకునే ప్లాన్ చేస్తున్నారు. దళితబంధుతో బీసీలు గుర్రుగా ఉన్నారు. బీసీబంధు డిమాండ్ సైతం తెరమీదకు వచ్చింది.అయితే ముందుస్తుగా లక్షసాయాన్ని తెరమీదకు తెచ్చిన కేసీఆర్.. మొదటగా కేవలం 14 కులాలవారికే సాయమని ప్రకటించడంతో మిగతా కులాలు సైతం ఆగ్రహంతో ఉన్నాయి. రాబోయే ఎన్నికల్లో గెలుపోటములను డిసైడ్ చేసేది బీసీలు కావడంతో వారికి గాలం వేసే పనిలో గులాబీ బాస్ నిమగ్నమయ్యారు. అందులో బాగంగానే బీసీబంధును తెచ్చేందుకు ఇప్పటికే కసరత్తు ప్రారంభించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. లబ్దిదారుల ఎంపిక ఎలా? మార్గదర్శకాలు ఏలా ఉండాలి? అనేదానిపై సమాలోచన చేస్తున్నట్లు సమాచారం.5 లక్షలా.. 10 లక్షలా..దళితబంధు పథకం లబ్దిదారులకు ప్రభుత్వం 10 లక్షలు అందజేస్తుంది. అయితే బీసీలు రాష్ట్ర జనాభాలో 50 శాతానికిపైగా ఉండటంతో వారికి ఆస్థాయిలో అందజేస్తే ఎంతఖర్చు చేయాల్సి ఉంటుందనేది బేరీజు వేస్తున్నట్లు సమాచారం. ఎక్కువ మందికి ఇవ్వాలంటే బీసీబంధును 10 లక్షలు కాకుండా 5లక్షలు అందజేస్తే ఎలా ఉంటుందనే అంశంపై కేసీఆర్ చర్చిస్తున్నారు. బడ్జెట్‌లో ఎంత కేటాయించాలి.. బీసీలోని ఏయే కులాలకు కేటాయించాలనేదానిపై సైతం పలువురు నిపుణులతో చర్చించినట్లు సమాచారం.మార్గాల అన్వేషణఇప్పటికే ఒకవైపు దళితబంధును పూర్తిస్థాయిలో అమలు చేయడంలో సర్కార్ జాప్యం చేస్తుంది. ఈ తరుణంలోనే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీబంధుపై కసరత్తును ప్రారంభించడంతో ఈ పథకానికి ఆదాయమార్గాల అన్వేషణపై దృష్టిసారించింది. ప్రభుత్వ భూములు ఎక్కడెక్కడా ఉన్నాయి.. వాటిని అమ్మితే వచ్చే ఆదాయం ఎంత..? విపక్షాలకు ఎన్నికల అస్త్రం కాకుండా ఎలా విక్రయించాలనేదానిపై కేసీఆర్ మంతనాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అన్ని సవ్యంగానే జరిగితే బీసీలకు బీసీబంధు వచ్చినట్లే.కాంగ్రెస్, బీజేపీలో రెడ్డి నాయకత్వంబీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కావడంతో అదే ఎన్నికలకు అస్త్రంగా కేసీఆర్ భావిస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గాలతో బీసీలకు న్యాయం జరుగదని బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమనే అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. కాంగ్రెస్‌లోని బీసీల పరిస్థితిపై ఆ పార్టీ మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హాట్ కామెంట్స్ చేశారు. ఇతర పార్టీలలో బీసీలు ఎలా గెలవగలుగుతున్నారు?.. కాంగ్రెస్ పార్టీలో ఎందుకు గెలవలేక పోతున్నారని ప్రశ్నించారు.అత్యధిక శాతం కలిగిన బీసీలకు రాజకీయ కోణంలో అవకాశాలు కల్పించాలన్నారు. బీసీలను విస్మరిస్తే.. ఏ రాజకీయ పార్టీకి అయినా మనుగడ కష్టమన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఎందుకు బీసీలకు విశ్వాసం కలిగించలేకపోతుందో.. కాంగ్రెస్ అధినాయకత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. పొన్నాల వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారాయి.ఇదిలా ఉంటే బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఎన్నికలకు ముందు మార్చడం చర్చకు దారితీసింది. బీసీని కాదని రెడ్డికి అప్పగించడంలో ఆంతర్యమేంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీంతో ఆ పార్టీకి సైతం బీసీలు దూరమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీసీలకు బీఆర్‌ఎస్ దగ్గరయ్యేందుకు ప్లాన్ చేస్తుంది. అందులో భాగంగానే బీసీ బంధుతో ఆ వర్గాలను ఆకర్షించి రాబోయే ఎన్నికల్లో లబ్ది పొందాలని కేసీఆర్ భావిస్తున్నారు.

# రెండు ప్రాంతాల్లోనే రెండో విడత

**విజయవాడ, జూలై 8 :**



పవన్ కల్యాణ్ చేపట్టే రెండో విడత వారాహి యాత్ర షెడ్యూల్ వచ్చేసింది. వారాహి విజయయాత్ర పేరుతో ఇప్పటికే మొదటి విడతను పవన్ కల్యాణ్ గత నెలలో పూర్తి చేశారు. ఇప్పుడు రెండో విడత యాత్రను ఆదివారం నుంచి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను జనసేన పార్టీ విడుదల చేసింది. జనసేన ట్వీట్ చేసినట్టుగా వారాహి విజయ యాత్ర రెండో విడత యాత్ర ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం అవుతుంది. మొదట ఏలూరులో బహిరంగ సభ ఉంటుంది. అక్కడ పవన్ కల్యాణ్ ప్రజలను ఉద్దేశించి వారాహిపై నుంచి మాట్లాడనున్నారు. పదో తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు జనవాణి కార్యక్రమం ఉంటుంది. స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు తెలుసుకోనున్నారు. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ముఖ్య నాయకులు, వీర మహిళలతో పవన్ సమావేశం అవుతారు. పార్టీలో సమస్యలు, వచ్చే ఎన్నికల్లో గెలుపునకు చేపట్టాల్సిన వ్యూహాలపై వారితో చర్చిస్తారు. 11వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు దెందులూరు నియోజకవర్గం ముఖ్య నాయకులతో మాట్లాడనున్నారు. ఈ భేటీలో వీరమహిళలు కూడా పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు తాడేపల్లి చేరుకుంటారు పవన్ కల్యాణ్. అక్కడే రాత్రి బస చేస్తారు.

12వ తేదీ సాయంత్ర ఐదు గంటలకు తాడేపల్లిగూడెంలో బహిరంగ సభ ఉంటుంది. అక్కడ ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. ఇప్పటికైతే జనసేన ముడు రోజుల షెడ్యూల్ మాత్రమే ప్రకటించింది. ఈ షెడ్యూల్ ను జూలై 6 మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కళ్యాణ్ తో పాటు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ చర్చించి ఖరారు చేశారు. ఏలూరుతో పాటు దెందులూరు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, తణుకు నియోజకవర్గాల నాయకులతో స్థానిక రాజకీయ పరిస్థితులపై పవన్ చర్చించారు. ఏలూరు నుంచి రెండో విడత యాత్ర చేపట్టాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు.

# ప్రారంభమైన ఎన్నికల హడావిడి

**హైదరాబాద్, జులై 8:**



తెలంగాణాలో ఎన్నికల హడావుడి మొదలయింది. ఇదివరకే ఢిల్లీ నుండి ఎన్నికల కమిషన్‌కు చెందిన ఉన్నత అధికారులు పలు దఫాలుగా రాష్టంలోని ఉన్నతాధికారులతో ఎన్నికల ఏర్పాటుకు సంబంధించి సమీక్షలు నిర్వహించారు. ఇక ఎలక్షన్ కమిషన్ రాష్టంలో ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాలని నోటిఫికేషన్ ఇస్తే.. అప్పుడు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాల్లోని అధికారులు అలర్ట్ అయ్యారు. ఇందులో భాగంగా వివిధ జిల్లాల అధికారులు ఎన్నికల ఏర్పాటుకు సంబంధించిన పనులపై దృష్టి సారించారు. ఈ ఏర్పాట్లకు సంబంధించిన పనులను ఒకొక్కటిగా పూర్తిచేస్తున్నారు. దీంతో జిల్లాల్లో ఎన్నికల వాతావరణం మొదలైంది. సెప్టెంబర్?లేదా అక్టోబర్ మధ్యలో ఎలక్షన్ నోటిఫికేషన్ జారీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎలక్షన్ కమిషన్ ఏర్పాట్లను వేగవంతం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలో అధికారులు కొత్త ఓటర్ల నమోదు, ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులు, ఈవీఎంలు, పోలింగ్?స్టేషన్ల తనిఖీలను ఇదివరకే ముమ్మరం చేశారు. బీఎల్‌వోల నియామకంతో పాటు శాఖలవారీగా ఆఫీసర్లు, ఉద్యోగులకు ఎన్నికల శిక్షణ దాదాపు పూర్తికావచ్చింది. అటు బూత్‌ల వారీగా వసతులు ఏర్పాటు ప్రక్రియ కూడా మొదలైంది. మరోవైపు కొత్త ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఆగస్టు 2న డ్రాఫ్ట్ ఓటరు లిస్ట్ విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆ నెల చివరికల్లా ఏర్పాట్లు పూర్తిచేసి ఎలక్షన్ ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సర్వసన్నద్ధమవుతోంది .ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటర్ లిస్టులో మార్పు చేర్పుల కోసం చేపట్టిన హౌస్?టూ హౌస్?సర్వే జూన్?23కే పూర్తయింది. బూత్?లెవల్ ఆఫీసర్లుగా నియమించిన అంగన్వాడీలు, ఆశా వర్కర్లు పాత ఓటర్ లిస్టుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. 'ఒక ఇంట్లో ఎంత మంది ఉన్నారు? ఓటరు లిస్టులో ఉన్న వ్యక్తులు బతికే ఉన్నారా? ఇక్కడే నివాసం ఉంటున్నారా? చనిపోయారా? వీరి పేర్లను లిస్టులో నుంచి తీసేయాల్సిన అవసరం ఉందా? పేర్లు, అడ్రస్‌లో మార్పులు చేయాల్సి ఉందా? ఇళ్లల్లో 18 ఏండ్లు నిండిన యువత ఉన్నారా? వారికి ఓటు హక్కు కల్పించాలా?' అనే వివరాలను సేకరించి ఆ వివరాలను ఆన్ లైన్‌లో ఎంట్రీ చేస్తున్నారు. చనిపోయిన వారి పేర్లను తొలగించి, పెళ్లిళ్లు చేసుకొని వెళ్లిన యువతుల వివరాలను ఆయా ఊళ్లకు బదిలీ చేస్తున్నారు. ఒకే పేరు మీద ఎంట్రీ అయిన డబుల్?ఓట్లను సరిచేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రక్రియ 70 శాతం పూర్తి కాగా, ఈ నెలాఖరు నాటికి వంద శాతం కంప్లీట్ చేయనున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు ఈ సర్వే ద్వారా 10.5 లక్షల డూప్లికేట్ ఓట్లను తొలగించినట్లు సమాచారం.తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర జిల్లా స్థాయి ఆఫీసర్లు వారంలో రెండు రోజులు తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేస్తున్నారు. వీరితో పాటు బీఎల్‌వోలతో స్టేషన్ల విజిట్?చేయిస్తున్నారు. అక్కడ ఎలాంటి వసతులు అవసరం ఉన్నాయి? కరెంటు ఉందా? లైట్లు, ఫ్యాన్లు ఉన్నాయా? మంచినీళ్లు అందుబాటులో ఉన్నాయా? టాయిలెట్స్ ఉన్నాయా? ఫర్నీచర్ ఉందా? ర్యాంప్ ఉందా? అనే వివరాలను ఫీల్డ్‌కు వెళ్లి పరిశీలిస్తున్నారు. ఇంకా ఎలాంటి వసతులు కల్పించాలనేది నోట్ చేసుకుంటున్నారు. క్రిటికల్, హైపర్ క్రిటికల్, సెన్సిటివ్ ప్రాంతాలను మండల స్థాయి ఆఫీసర్లు విజిట్ చేసి పరిశీలిస్తున్నారు. సెన్సిటివ్ ఏరియాల్లో పోలింగ్?స్టేషన్ల లొకేషన్ మార్చాలా? రద్దీ అధికంగా ఉంటే స్టేషన్ ప్రాంతంలో అదనంగా మరో స్టేషన్? అవసరం అవుతుందా? అనే వివరాలను క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు రికార్డు చేస్తున్నారు.కొత్త ఓటరుగా ఎన్రోల్ చేసుకోవడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామాల్లో కొందరు వలంటీర్లు, బీఎల్వోలు సైతం 18 ఏండ్లు నిండిన వారిని గుర్తించి, వారితో కొత్త ఓటరుగా నమోదు చేయిస్తున్నారు. ఈ ప్రక్రియ జోరుగా సాగుతుండగానే మరోవైపు కొత్త ఓటర్ల నమోదు కోసం వచ్చిన అప్లికేషన్లు, మార్పులు, చేర్పులు, డిలిషన్ వివరాలతో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆగస్టు 2న డ్రాఫ్ట్ ఓటరు లిస్ట్‌ను పబ్లిష్ చేయనుంది. ఈ లిస్టును అన్ని గ్రామాలవారీగా పంచాయతీ ఆఫీసుల వద్ద అతికించనున్నారు. వీటి ఆధారంగా మళ్లీ అబ్జెక్షన్లు, మిస్సింగ్ నేమ్స్ తదితర వివరాలను సేకరించనున్నారు. పొలిటికల్ పార్టీలకు ఈ లిస్ట్‌ను అందజేసి, శని, ఆదివారాల్లో స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నారు. అనంతనం సెప్టెంబరులో తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎలక్షన్ కమిషన్‌డెమాన్ స్ట్రేషన్, స్టాస్టిక్ ఈవీఎంలను అందుబాటులోకి తేనుంది. ఇందులో ఒక సెట్ తహసీల్దార్ ఆఫీసులో, మరొక సెట్ మొబైల్ ఈవీఎం ద్వారా గ్రామాల్లో ప్రదర్శించనున్నారు. మొబైల్?టీం వెంట సెక్టోరియల్ ఆఫీసర్ అందుబాటులో ఉంటారు. ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈనెల 10 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఆగస్టు 30 కల్లా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసేలా టార్గెట్?పెట్టుకున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో ఆఫీసర్లు రూట్ మ్యాప్ లకు సంబంధించిన షెడ్యూల్స్ తయారు చేస్తున్నారు.ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ స్థాయి ఆఫీసర్లు నిత్యం తనిఖీ చేస్తున్నారు. ఈవీఎంల భద్రత ఎలా ఉంది? అనే దానిపై ఎప్పటికప్పుడు రిపోర్ట్ తెప్పించుకుంటున్నారు. అలాగే ఎన్నికల రిటర్నింగ్?ఆఫీసర్లు నియోజకవర్గ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఎన్ని ఈవీఎంలు అవసరం అవుతాయనే వివరాలను నోట్ చేస్తున్నారు.విలేజ్ లెవల్‌లో 12 కేటగిరీలలో ఉన్న వర్కర్లను బీఎల్వోలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకోగా, అందులో తెలంగాణలో ఆశా కార్యకర్తలు, అంగన్వాడీలు, పంచాయతీ సెక్రటరీలు, వీవోఏలను బీఎల్వోలుగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 34,867 మంది ప్రస్తుతం బీఎల్వోలుగా పని చేస్తుండగా, వీరిలో అత్యధిక మంది అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలే ఉన్నారు. వీరికి మొబైల్ టెక్నాలజీపై పట్టు ఉండటం, గ్రామ స్థాయిలో అందరితో పరిచయాలు ఉండటం, గతంలో ప్రభుత్వం నిర్వహించిన సర్వేల్లో భాగస్వామ్యం కావడంతో ఎక్కువ జిల్లాల్లో అంగన్?వాడీలు, ఆశలనే బీఎల్వోలుగా నియమించారు.ఎన్నికలకు సంబంధించిన వివరాలు గతంలో గరుడ యాప్ ద్వారా అప్?డేట్ చేసేవారు. కానీ, ఇప్పుడు బీఎల్వో యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ యాప్ ద్వారానే కొత్త ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, డెలిషన్‌కు సంబంధించిన ఫామ్స్‌ను బీఎల్వోలో అప్ లోడ్ చేస్తున్నారు.

## నెల రోజుల పాటు డ్రగ్స్ ముఠా లెక్క తీశాం

**హైదరాబాద్, జులై 8**

బెంగళూరు కేంద్రంగా హైదరాబాద్ కు పెద్ద ఎత్తున డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠాను హైదరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. నెలరోజుల పాటు అక్కడే మకాం వేసి మరీ నిందితులను అరెస్ట్ చేశారు. అయితే ఇందుకు సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న కేసులో నైజీరియాకు చెందిన అగ్ బో మ్యాక్స్ వెల్, ఇకెం ఆస్టిన్ ఒబాకా, చిగోజీలతో పాటు సాయి ఆకాశ్ అనే తెలుగు కుర్రాడిని అరెస్ట్ చేసినట్లు సీపీ సీవీ ఆనంద్ వివరించారు. బెంగళూరు నుంచి నగరానికి వచ్చి డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తమకు పక్కా సమాచారం వచ్చిందని తెలిపారు. అప్రమత్తమైన నార్కోటిక్స్ విభాగం పోలీసులు దర్యాప్తు చేశారన్నారు. ఈక్రమంలోనే నెల రోజుల పాటు బెంగళూరులోనే మకాం వేసి... నైజీరియన్ల కదలికలపై నిఘా పెట్టారని వెల్లడించారు. అయితే ఈ కేసులో మొత్తం నలుగురిని అరెస్ట్ చేయగా.. మరో నైజీరియన్ పరారైనట్లు వివరించారు. ఈ కేసులో డ్రగ్స్ కింగ్ పిలన్ మ్యాక్స్ వెల్ ని ప్రధాన నిందితుడిగా గుర్తించినట్లు స్పష్టం చేశారు. మ్యాక్స్ వెల్, చిగోజి నైజీరియన్ నుంచి మెడికల్ వీసాపై వచ్చారని... మరో నిందితుడు ఒబాక విద్యార్థి వీసాపై వచ్చినట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రస్తుతం పట్టుబడ్డ గ్యాంగ్ చాలా తెలివిగా డ్రగ్స్ సరఫరా, విక్రయాలు జరిపినట్లు తమ విచారణలో తేలిందన్నారు. నకిలీ అడ్రస్ లతో బ్యాంకు ఖాతాలు తెరిచి లావాదేవీలు జరిపినట్లు నిర్ధారించారు. దాదాపు ఆరు నెలల్లోనే 4 కోట్లకు పైగా లావాదేవీలు జరిపినట్లు గుర్తించామన్నారు. నైజీరియన్ ముఠా సభ్యులు బెంగళూరులో ఉంటూ హైదరాబాద్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు తేలిందన్నారు. డ్రగ్స్ తీసుకునే అలవాటు ఉన్న హైదరాబాద్ వాసులు సంజయ్ కుమార్, తుమ్మ భాను తేజని పోలీసులు కొద్ది రోజుల క్రితం అరెస్ట్ చేశారు. ఈక్రమంలోనే వారు డ్రగ్స్ ఎవరి దగ్గర, ఎలా కొనుగోలు చేశారో పోలీసులకు వెల్లడించారు. ఈ సమాచారంతోనే పోలీసులు దర్యాప్తు చేయగా.. గుట్టంతా రట్టు అయిందన్నారు. మూడ్రోజుల క్రితం నైరోబీ నుంచి షార్జా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిందో మహిళ. అయితే బురుండీ దేశానికి చెందిన 43 ఏళ్ల మహిళ ఎయిర్ అరేబియా ఎయిర్ వేస్ విమానం జీ9458లో ఆదివారం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంది. అయితే మహిళ పద్ధతి కాస్త తేడాగా, భయంగా కనిపించడంతో కస్టమ్స్ అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో వెంటనే ఆమెను పక్కకు పిలిచి ఆమె లగేజీని తనిఖీ చేశారు. ఓ సంచిలో ఆఫ్రికా సంప్రదాయ దుస్తులు ఎనిమిది, మూడు సబ్బులు, ఒక హ్యాండ్ బ్యాగ్ ఉన్నాయి.ఇంత సింపుల్ లగేజీతో వచ్చిన ఆమె ఎందుకు కాస్త కంగారుగా భయంతో ఉందని అధికారులకు అనుమానం వచ్చింది. ఆమె లగేజీని కాస్త నిశితంగా పరిశీలించగా అధికారులు షాక్ కు గురయ్యారు. ఆఫ్రికా సంప్రదాయ దుస్తులకు ఉన్న పెద్ద పెద్ద గుండీల్లో, సబ్బుల మధ్య ప్లాస్టిక్ కవర్ లో, హ్యాండ్ బ్యాగ్ అంచుల్లో హెరాయిన్ ఉన్నట్లు అర్థం అయింది. అయితే పౌడర్ రూపంలో ఉన్న హెరాయిన్ ను పొట్లాల్లో పెట్టి.. వాటిని గుండీలు, సబ్బులు, హ్యాండ్ బ్యాగ్ అంచుల్లో అమర్చినట్లు గుర్తించారు. 2.27 కిలోల ఆ హెరాయిన్ విలువ మార్కెట్ ధర ప్రకారం రూ.14.2 కోట్లు ఉంటుందని అధికారులుల చెబుతున్నారు.

# అభివృద్ధి సంక్షేమం జోడెద్దుల సవారి రాజశేఖర్ రెడ్డి పరిపాలన

**పేద ప్రజల గుండెల్లో కొలువైన దేవుడు రాజశేఖర్ రెడ్డి**

**కమాన్ పూర్**




కమాన్ పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైనాల రాజు ఆధ్వర్యంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఏప్రిల్ 9 2003 నాడు మహా ప్రజా ప్రస్థానం యాత్ర మొదలుపెట్టి చేవెళ్ల నుండి ఇచ్చాపురం వరకు పాదయాత్ర చేసి 1470 కిలోమీటర్ల దూరం మండుటెండల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితులను ప్రజలతో మమేకమై వారి వారి కష్టాలనే ప్రజా మ్యానిఫెస్టో గా పెట్టి అధికారంలోకి రాగానే మొదటి సంతకం తోటి ఉచిత విద్యుత్ ని అందించిన ఘనత ఆనాడు రాజశేఖరరెడ్డి దే అదేవిధంగా ప్రతి ఒక్కరికి నిలువ నీడనివ్వాలన్న ఉద్దేశంతోటి ఇందిరమ్మ ఇండ్ల పేరుతో ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించిన ఘనత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ది అదేవిధంగా పేద విద్యార్థుల కోసం ఫీజు రీయంబర్స్మెంట్ పథకం మరియు పేద ప్రజానీకం కోసం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ఆనాడు టెన్షన్ విధానం కేవలం 70 రూపాయలు ఉంటే వృద్ధాప్య పెన్షన్లను పెద్ద మొత్తంలో ఫలాలు అందరికీ అందే విధంగా చేసి రెండు వందల రూపాయలకు పెన్షన్ పెంచడము 500 రూపాయల అభయా హస్తం చేయడం సకాలంలో ఆరోగ్యాన్ని అందించడం కోసం 108 వాహనాలను ప్రవేశపెట్టడం ఆహార ఆరోగ్య భద్రత విషయం కచ్చి ప్రతి ఒక్క కుటుంబానికి రేషన్ కార్డులు తీసుకురావడం ఆరోగ్యశ్రీ కార్డును అందించడం ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిన ఘనుడు గౌరవ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో రాజశేఖర్ రెడ్డి పరిపాలన విధానంలో జోడెద్దుల సవారి లాగా అభివృద్ధి ఒకవైపు సంక్షేమం ఒకవైపు చేస్తూ కాంగ్రెస్ పార్టీని ఎవరెస్టు శిఖరం అంత ఉన్నత శిఖరాలలో చేర్చిన వ్యక్తి రాజశేఖర్ రెడ్డి వారు ఈనాడు మన మధ్య లేకపోయినా వారు చేసిన అభివృద్ధి ఫలాలు నేటికీ కనబడుతుండడం కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మా గుండెల్లో నిలిచిపోతారని చెప్పడం జరిగింది గౌరవ రాజశేఖర్ రెడ్డి గారికి ప్రస్తుత ఎమ్మెల్యే ఏఐసీసీ సెక్రెటరీ శ్రీధర్ బాబు ని మంతిని నియోజక వర్గం అంటే ఎనలేని ప్రేమ ఉండేదని అందువల్లనే ఇక్కడ మహానీయుడు శ్రీపాద రావు పేరు మీద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేసి ఈ ప్రాంత ప్రజలు రెండు పంటలు పండిస్తున్నారు అంటే దానికి కారణం ఆనాడు జలయజ్ఞం పేరుతోటి శ్రీపాద ఎల్లంపల్లి ని కట్టించిన ఘనత రాజశేఖర్ రెడ్డి ని తీసుకొచ్చిన చరిత్ర శ్రీధర్ బాబు ది కమాన్ పూర్ మండల కాంగ్రెస్ నాయకులు గుర్తుచేసుకున్నారు వారి పాలన కాలంలోనే మంత్రిని నియోజకవర్గానికి సంబంధించి ఎన్నో విద్యాసంస్థలు జేఎన్టీయూ కృషి విజ్ఞాన కేంద్రం ఇంటర్ కాలేజీలు డిగ్రీ కాలేజీలు ఐటిఐ కాలేజీలు అనేక సబ్స్టేషన్లు పూర్తిస్థాయిలో మంథని నియోజకవర్గ రూపురేఖలు శ్రీధర్ బాబు రాజశేఖర్ రెడ్డి వద్దకెళ్లి చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వైనాల రాజు జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్ జిల్లా కార్యదర్శులు సయ్యద్ అన్వర్ బొంపల్లి రాజయ్య కమాన్పూర్ మండలం సర్పంచులు ఖద్గం రవీందర్ తొగరి అన్నపూర్ణ అశోక్ ఆకుల ఓదెలు కమాన్పూర్ మాజీ కోఆప్షన్ ఎండి రఫిక్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంత శ్రీనివాస్ ఎంపీటీసీ శివ శంకరయ్య ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్యాల తిరుపతి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అప్సర్ మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సయ్యద్ ఇక్బాల్ గ్రామ శాఖ అధ్యక్షులు ఇరుగురాల శేఖర్ కోల నరేందర్ గడ్డం శీను పిడుగు శంకర్ యాదగిరి రాజయ్య మాజీ సర్పంచులు సాగి శ్రీధర్ రావు ఆడవాళ్ళ చంద్రయ్య కుందార బాబు పిడుగు నరసయ్య మాజీ ఎంపీటీసీ చొప్పరి గట్టయ్య గుండేటి శ్రీ మూర్తి ఎండి ముస్తాక్ కుక్క రవి ఎండి యూసఫ్ లల్లు చాట్ల రాయమల్లు ఇరగంటి ప్రభాకర్ ఎండి మహబూబ్ రావు ఇనగంటి నరేందర్ రావు కోలేటి రమేష్ దాసరి రాజేష్ ఎండి రహీం ఎండి లస్కర్ మంతిని రామస్వామి కోటగిరి రాజన్న ఎండి రహీం ఎండి అహ్మద్ తుళ్ల కనకయ్య పిడుగు రమేష్ పిడుగు రాజు భోగి రమేష్ దాసరి రాజేష్ చొప్పరి తిరుపతి బూస తిరుపతి ఇరుగురాల కుమార్ మామిడి రాజు ఎజ్జ గంగయ్య అనవే నా చిన్న రవి ఎలా పోతారపు పోచ మల్లు చొప్పరి శేఖర్ పిడుగు వెంకటేష్ పిడుగు రమేష్ షీలారపు కొమురయ్య రంగం చంద్రయ్య రామిండ్ల చంద్రమౌళి పిడుగు విష్ణువర్ధన్ జనగాం శేఖర్ కుమ్మరి సాయి వడ్లకొండ అభిలాష్ గౌడ్ బాత్రూం శంకర్ అలుగువెల్లి రమేష్ రెడ్డి బిల్లా వెంకటేష్ పిట్టల బాలు, పిడుగు వెంకటేష్ బొంగోని వీరేశం మూఢం కొమురయ్య ఒడ్నాల శ్రీనివాస్ యాదగిరి విజయ్ మరియు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## మోడీని తిట్టింది చంద్రబాబే



**విజయవాడ, జులై 8**

బీజేపీ పిలవకపోయినా ఎన్డీయేలోకి వెళ్లాలని టీడీపీ ఉవ్విళ్లూరుతోందంటూ విమర్శలు గుప్పించారు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి. చంద్రబాబు పిలిచినట్లు ప్రచారం చేసుకుంటున్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. పిలుస్తారా?వెళతారా అన్నది ఆ రెండు పార్టీలకు సంబంధించిన విషయమని, అధికారం కోసమే కలిసే ప్రయత్నం చేస్తే ఆ కూటమికి రంగు, రుచి, వాసన ఉండదన్నారు. మోడీని ఇష్టం వచ్చినట్లు తిట్టిందీ చంద్రబాబేనని ఆయన అన్నారు. బీజేపీకి పార్ట్‌నర్ గా ఉండి కూడా చంద్రబాబు కేంద్రం నుంచి ఒక్కటి కూడా సాధించుకు రాలేకపోయారన్నా?రు. జగన్ ఇండిపెండెంట్ గా ఉండి కూడా కేంద్రం నుంచి నిధులు తీసుకుని రాగలుగుతున్నారని, అవసరం అయినప్పుడు ఏ అంశంపై అయినా అభిప్రాయాలను నిర్భయంగా చెప్పగలుగుతున్నారన్నారు.2014లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే చంద్రబాబు మళ్లీ ఇప్పుడు వల్లెవేస్తున్నారని, అంటే ఆ హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఘోరంగా మోసం చేసినట్లే కదా అని ఆయన ప్రశ్నించారు. 2014లో చంద్రబాబు మోసం చేసి అధికారంలోకి వచ్చాడని, ప్రజలకు జ్ఞాపక శక్తి తక్కువ అని చంద్రబాబు, లోకేష్ అనుకుంటారని, ఎన్టీఆర్ అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న లక్ష్మీ పార్వతీనే అక్రమంగా ఉంచుకున్నారు అని ముద్ర వేసింది టీడీపీ అని ఆయన వ్యాఖ్యానించారు. వ్యక్తిత్వ హననం చేసే అలవాటు టీడీపీకే ఉందని, రాజకీయాన్ని బురదగా మార్చిన వ్యక్తి చంద్రబాబు అని ఆయన విమర్శించారు. పవన్ కల్యాణ్ ఆ తానులోని ముక్కే.. విలువలకు కట్టుబడి ఉండే వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అని సజ్జల వ్యాఖ్యానించారు.

# ‘నా.. నీ ప్రేమ కథ’ టీజర్



అముద శ్రీనివాస్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం ‘నా.. నీ ప్రేమ కథ’. కారుణ్య చౌదరి కథానాయిక. పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఎంటర్ టైన్ మెంట్స్ పతాకంపై పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ ని తెలంగాణ ఆర్ధిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి హరీష్ రావు లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..‘నా.. నీ ప్రేమ కథ’ చిత్రం టీజర్ అద్భుతంగా వుంది. హీరో, దర్శకుడు అముద శ్రీనివాస్ చక్కన్ని ప్రతిభ కనబరిచారు. ఈ టీజర్ ని చూస్తుంటే సినిమా ఖచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం వుంది. సినిమాలో నటీనటులంతా మంచి ప్రతిభ కనబరిచారు. ఈ చిత్రంతో నిర్మాత పోత్నాక్ శ్రవణ్ కుమార్ కి మంచి లాభాలు రావాలి. హీరో, దర్శకుడు అముద శ్రీనివాస్ కి మంచి అవకాశాలు అందుకోవాలి. చిత్ర యూనిట్ అందరికీ శుభాభినందనాలు” తెలిపారు.

ఈ చిత్రానికి ఎంఎస్ కిరణ్ కుమార్ కెమరామెన్ గా పని చేస్తున్నారు. ఎంఎల్ పి రాజా సంగీతం సమకూరుస్తుండగా చిన్నా నేపధ్య సంగీతం అందిసస్తున్నారు. నందమూరి హరి ఎడిటర్ గా పని చేస్తున్నారు.

నటీనటులు :అముద శ్రీనివాస్ కారుణ్య చౌదరి, రమ్య, అజయ్ ఘోష్, షఫీ, అన్నపూర్ణమ్మ, ఫిష్ వెంకట్ జబర్ దస్త్ ఫణి, నాగిరెడ్డి. బస్ స్టాప్ కోటేశ్వర రావు, మాధవి, వేములూరి రాజశేఖర్, హరి తదితరులు

# ‘జైలర్’ నుంచి పాట విడుదల



సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా సక్సెస్ ఫుల్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ ‘జైలర్’. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుంచి ‘నువ్వు కావాలయ్యా’పాటని విడుదల చేశారు మేకర్స్. స్టార్ కంపోజర్ అనిరుధ్ ఈ పాటని క్యాచి బీట్స్ తో ఇన్స్టంట్ చార్ట్ బస్టర్ నెంబర్ గా స్వరపరిచారు. అరుణ్‌రాజా కామరాజ్ రాసిన ఈ పాటను శిల్పారావు, అనిరుధ్ కలసి ఎనర్జిటిక్ గా పాడారు. ఈ పాటలో సూపర్ స్టార్ రజనీకాంత్ స్వాగ్, గ్రేస్ మెస్మరైజ్ చేయగా, తమన్నా డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. ప్రముఖ తారాగణం ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. మోహన్ లాల్, శివ రాజ్‌కుమార్ రమ్య కృష్ణన్, తమన్నా తో పాటు వసంత్ రవి, నాగ బాబు, యోగి బాబు, జాఫర్ సాదిక్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. టాప్ టెక్నికల్ టీం ఈ చిత్రానికి పని చేస్తోంది. విజయ్ కార్తిక్ కన్నన్ కెమరామెన్ గా పనిచేస్తుండగా ఆర్ నిర్మల్ ఎడిటర్ గా చేస్తున్నారు. డిఆర్ కే కిరణ్ ఆర్ట్ డైరెక్టర్ కాగ, స్టన్ శివ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. జైలర్ ఆగస్టు 10న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తారాగణం: రజనీకాంత్, మోహన్ లాల్, జాకీ ష్రాఫ్, శివ రాజ్‌కుమార్, సునీల్, రమ్య కృష్ణన్, వినాయకన్, మర్నా మీనన్, తమన్నా, వసంత్ రవి, నాగ బాబు, యోగి బాబు, జాఫర్ సాదిక్, కిషోర్, బిల్లీ మురళీ, సుగుంతన్, కరాటే కార్తీ, మిథున్, అర్షద్, మారిముత్తు , రిత్విక్, శరవణన్, అరంతంగి నిషా, మహానంది శంకర్ తదితరులు

# బ్రో’ నుండి ‘మై డియర్ మార్కండేయ’ పాట విడుదల



తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, పవన్ కళ్యాణ్-సాయి ధరమ్ తేజ్ ద్వయం మొదటిసారి కలిసి నటిస్తున్న ‘బ్రో’ చిత్రం కోసం జీ స్టూడియోస్‌తో చేతులు కలిపింది. సముద్రఖని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించిన ఈ సినిమా జూలై 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన క్యారెక్టర్ పోస్టర్లు, ప్రోమోలు, టీజర్‌కు అద్భుతమైన స్పందన రాగా, ఈరోజు ‘బ్రో’ నుండి మొదటి సింగిల్ విడుదలైంది.

ఎస్ థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ లపై తెరకెక్కించిన ‘మై డియర్ మార్కండేయ’ పాటను రేవంత్, స్నిగ్ధ శర్మ ఆలపించారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటకు గణేష్ స్వామి, భాను నృత్యరీతులు అందించారు. చిత్రం కోసం ప్రత్యేకంగా నిర్మించిన విలాసవంతమైన పబ్ సెట్‌లో ఈ పాట చిత్రీకరించబడింది. సమయం మరియు జీవితం గురించి లోతైన భావంతో నిండిన ఈ పాట, సందేశాన్ని ఇవ్వడంతో పాటు అందరూ కాలు కదిపేలా ఉంది.

మై డియర్ మార్కండేయ పాట “కమాన్ కమాన్ డ్యాన్స్ బ్రో.. యమ్మా యమ్మా బీట్స్ బ్రో.. జిందగీనే జూక్‌బాక్స్ బ్రో” అంటూ ట్రెండీగా ప్రారంభమైంది. స్టైలిష్ అవతార్‌లో కనిపించిన సాయి ధరమ్ తేజ్ తనదైన నాట్యంతో ఆకట్టుకున్నారు. అద్భుతమైన సినిమాటోగ్రఫీ మరియు ప్రొడక్షన్ డిజైన్ తో కన్నుల పండుగలా ఉంది పాట.

తన చరిష్మాతో తెరకు నిండుతనం తీసుకొచ్చే పవన్ కళ్యాణ్ రాకతో పాట ఊపందుకుంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. “మై డియర్ మార్కండేయా.. మంచి మాట చెప్తా రాసుకో.. మళ్లీ పుట్టి భూమికి రానే రావు నిజం తెలుసుకో.. పక్క దిగి నిద్రలేచే ప్రతిరోజు పండగ చేసుకో..” అనే పంక్తులు ఆయన వ్యక్తిత్వానికి, పాత్రకు సరిగ్గా సరిపోయేలా ఉన్నాయి.

ఈ పాటలో ప్రత్యేక పాత్రలో కనిపిస్తున్న ఊర్వశి రౌతేలా తన అందం, నాట్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్నిగ్ధా శర్మ ఈ పాటకు జానపద ఆకృతిని తీసుకువచ్చారు. అద్భుతంగా స్వరపరిచిన ఈ పాట సంగీత ప్రియులను కట్టిపడేసేలా ఉంది.

రామజోగయ్య శాస్త్రి తన ఉల్లాసమైన సాహిత్యంతో మనుషుల స్వభావం మరియు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రతిరోజూ ఓ పండుగలా ఎలా జీవించాలి అనే విలువైన సందేశాన్ని ఇచ్చారు. దుస్తులు దగ్గర నుంచి ఛాయాగ్రహణం, నృత్యం, సంగీతం ఇలా ‘మై డియర్ మార్కండేయ’ పాటకు అన్నీ చక్కగా కుదిరాయి.

ఈ సినిమాలో టైటిల్ పాత్రధారి(బ్రో)గా పవన్ కళ్యాణ్ నటిస్తుండగా, మార్క్ అకా మార్కండేయులుగా సాయి ధరమ్ నటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కేతిక శర్మ, ప్రియా ప్రకాష్ వారియర్, సముద్రఖని, రోహిణి, రాజేశ్వరి నాయర్, రాజా, తనికెళ్ల భరణి, వెన్నెల కిషోర్, సుబ్బరాజు, పృధ్వీ రాజ్, నర్రా శ్రీను, యువలక్ష్మి, దేవిక, అలీ రెజా, సూర్య శ్రీనివాస్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుజిత్ వాసుదేవ్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950